


# విజయభాను

45వ వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, ఆదివారం 21-11-2021 | VIJAYABHANU DAILY * VISAKHAPATNAM | సంపుటి : 45 సంచిక : 55 పేజీలు : 08 వెల : 1 రూపాయి

### వరద ప్రభావిత ప్రాంతాల్లో
## సీఎం జగన్ ఏరియల్ సర్వే



కడప-తిరుపతి: వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు, ఆ తర్వాత వరదలకు గురైన ప్రాంతాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహ న్‌రెడ్డి ఏరియల్ సర్వే నిర్వహించారు. గన్నవరం విమానాశ్రయం నుంచి కడప విమానాశ్రయం చేరుకున్న ముఖ్యమంత్రి సహాయ కార్యక్రమాల్లో నిమగ్నమైన నేవీ సిబ్బందిని కలుసుకున్నారు. జిల్లాలో వరద పరిస్థితులపై స్థానిక ప్రజా ప్రతినిధులు, కలెక్టర్లతో మాట్లాడారు. తర్వాత హెలికాప్టర్ ద్వారా బుగ్గవంక వాగు కారణంగా తరువాయి 2లో..



## పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం

### ఎంపీ (రాజ్యసభ) విజయసాయి రెడ్డి







విశాఖపట్నం (విజయభాను న్యూస్) : పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం లభిస్తుందని రాజ్యసభ సభ్యులు, వైకాపా జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎంఎల్ సి అబ్యర్థులు, వంశీక్రిష్ణ శ్రీనివాస్ యాదవ్, వరుదు కళ్యాణిల నామినేషన్ సందర్భంగా బీచ్ రోడ్డులోని వైఎస్ ఆర్ విగ్రహానికి గజమాలవేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంశీక్రిష్ణ శ్రీనివాస్, వరుదు కళ్యాణిలు మెదటి నుండి పార్టీని నమ్ముకొని, పార్టీకోసం పనిచేసారని, వారి కష్టాన్ని గుర్తించిన ముఖ్యమంత్రి వారికి గౌరవమైన స్థానం కల్పించారని అన్నారు. కష్టపడి పార్టీ కోసం పనిచేసేవారెవ్వరికీ ముఖ్యమంత్రి ఎట్టి పరిస్థితి లోనూ విశ్మరించరని తరువాయి 2లో..

## జాతీయ స్థాయిలో విశాఖ నగరానికి
# 9వ ర్యాంకు

### - విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి
### - జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి.లక్ష్మీశ



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ భారత్ కార్యక్రమాలలో భాగంగా స్వచ్ఛ సర్వేక్షన్ - 2021 సంబంధించి స్వచ్ఛ అమృత్ మహోత్సవం అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో జాతీయ స్థాయిలో విశాఖ నగరానికి 9వ ర్యాంకు లభించిందని, ఇది పూర్తిగా ప్రజల సహకారంతోనే విశాఖ నగరానికి దక్కిందని, ఈ అవార్డును విశాఖ నగర ప్రజలకు అంకితమిస్తున్నామని విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. శనివారం ఢిల్లీలో కేంద్ర గృహ మరియు పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో ఆ శాఖ సహాయ మంత్రి కౌశల్ కిషోర్ వారి నుండి విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి.లక్ష్మీశ, పూర్వ కమిషనర్ డాక్టర్ జి. సృజన, జివిఎంసి చీఫ్ ఇంజనీర్ పి. రవి కృష్ణంరాజు, పూర్వ అదనపు కమిషనర్ డాక్టర్ వి. సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కెఎస్ ఎల్ జి శాస్త్రి.., 10 నుండి 40లక్షల జనాభా గల నగరాల కేటగిరీలో విశాఖ నగరానికి ఉత్తమ ప్రజాభిప్రాయ సేకరణ (Best City in Citizen Feedback) నగరంగా, 3 స్టార్ స్థాయి చెత్తరహిత నగరంగా (3 Star rating in Garbage Free City) అవార్డులను స్వీకరించటం జరిగినది. ఈ అవార్డుల తరువాయి 4 లో..

## ఏపీకి జాతీయ స్థాయిలో అవార్డుల పంట

ఢిల్లీ: జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌కి స్వచ్ఛ భారత్ అవార్డుల పంట పండింది. దేశంలో పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగ్గా నిర్వహించాలనే ఉద్దేశంతో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఏపీ పలు కేటగిరిలో అవార్డులను కైవసం చేసుకుంది. అవార్డుల వివరాలు.. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విజయవాడకు మూడో ర్యాంక్ రాగా, రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్న విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్,అధికారులు ఈ అవార్డుని అందుకున్నారు. అనంతరం విజయవాడ మేయర్ మాట్లాడుతూ.. తరువాయి 2లో..




## 'చంద్రబాబు సతీమణి గురించి సభలో ఎక్కడా ప్రస్తావన రాలేదు'

### మంత్రి కురసాల కన్నబాబు వెల్లడి

తూర్పుగోదావరి: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడిది బాధపెట్టించే తత్వమే కానీ బాధపడే మనస్తత్వం కాదని మంత్రి కురసాల కన్నబాబు విమర్శించారు. చంద్రబాబు ఎప్పుడు కన్నీళ్లు పెట్టిస్తారే తప్ప.. పెట్టుకోరని ధ్వజమెత్తారు. తన భార్యను ఎవరో ఏదో అన్నట్లు చంద్రబాబు చిత్రీకరిస్తున్నారని, ప్రజల సానుభూతి కోసమే చంద్రబాబు డ్రామాలాడుతున్నారని మండిపడ్డారు. ఒక్కరోజైనా చంద్రబాబు విలువతో కూడిన రాజకీయం చేశారా అని ప్రశ్నించారు. చంద్రబాబుకు ఎప్పుడూ పదవి కావాలని, పదవి కోసం ఆయన ఎవరినైన తరువాయి 2లో..

### కరీమున్నిసా భౌతికకాయానికి
## నివాళులర్పించిన సీఎం జగన్

విజయవాడ : గుండెపోటుతో మరణించిన కృష్ణా జిల్లా ఎమ్మెల్సీ మహ్మద్ కరీమున్నీసా భౌతికకాయానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మృతిపట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అనంతపురం కరీమున్నిసా కుటుంబ సభ్యులను సీఎం జగన్ పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. హెూం మంత్రి సుచరిత, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వెల్లంపల్లి శ్రీనివాస్, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్ రావు కూడా ఎమ్మెల్సీ కరీమున్నిసా భౌతికకాయానికి నివాళులర్పించారు. కాగా, కృష్ణా జిల్లా ఎమ్మెల్సీ ఎండీ కరీమున్నిసా గుండెపోటుతో శుక్రవారం అర్ధరాత్రి మృతి తరువాయి 2లో..

## భవన నిర్మాణ కార్మిక సభ్యుల కొరకు సమాచార హక్కులో దరఖాస్తు



మధురవాడ (విజయభాను న్యూస్) : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు లో గల సభ్యుల సంఖ్య ఇతర వివరాలను సమాచార హక్కు ద్వారా అందించాలని రాష్ట్ర టి ఎన్ టి యు సి పిలుపుమేరకు విశాఖ జిల్లా టి ఎన్ టి ఎస్ సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతి శివాజీ ఆధ్వర్యంలో శనివారం అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సుజాతకు సమాచార హక్కు ద్వారా ఇవ్వాలని దరఖాస్తు చేశారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డులో ఏప్రిల్ 2019 నుండి 31 అక్టోబర్ 2021 వరకు సభ్యుల సంఖ్య వివరాలను తెలపాలని ఆర్టిఐ యాక్ట్ ద్వారా దరఖాస్తు చేశామన్నారు, అదేవిధంగా ఎంతమంది కార్మికులు దరఖాస్తు చేసుకున్నారు అందులో ఎంత మందిని అర్హులుగా తీసుకున్నారో తెలియజేయాలని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కు ఆర్టిఐ యాక్ట్ ద్వారా అర్జీ పెట్టినట్టు తెలిపారు. అందుకుగాను మధురవాడ తపాలకేంద్రం నుండి నిబంధనల ప్రకారం సంబంధిత రుసుము చెల్లించి పోస్టు ద్వారా పంపించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టి.ఎన్.టి.యు.సి సభ్యులు కిషోర్, మురళి, శంకర్, నాగేశ్వరావు, ఆది బాబు, ఈశ్వరరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఆజాదీకా అమృత్ మహోత్సవ్ పోటీల్లో చెన్నా ప్రణాళిక కు ప్రధమ బహుమతి




విశాఖ సిటీ (విజయభాను న్యూస్) : ఆజాదీకా అమృత్ మహోత్సవ్- 2021లో భాగంగా 54 వ జాతీయ గ్రంథాలయ వారోత్స వాలను పురస్కరించుకొని విద్యార్థులకు నిర్వ హించిన వ్యాసరచన పోటీల్లో అల్వార్ దాస్ విద్యాసంస్థల్లో భాగమైన ఎంవిపి లోని ఏ.ఎస్. రాజా మహిళా కళాశాల ఇంటర్ మీడియట్ విద్యార్థిని చెన్నా ప్రణాళికకు ప్రథమ బహుమతి లభించింది. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఈనెల 14 నుంచి 20 వరకు నిర్వహించి అనంతరం పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను గ్రంథాలయ అధికారులు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతియేటా విద్యార్థులకు వివిధ అంశాలలో పోటీలను నిర్వహించి వారిలోని సృజనాత్మకతను వెలికితీసే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను చేపట్టామన్నారు. వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతి గెలుపొందిన చెన్నా ప్రణాళిక మాట్లాడుతూ తమకు విద్యాబోధనలో చక్కటి సలహాలు, సూచనలు అందిస్తున్న తమ ఏ.ఎస్. రాజా మహిళా కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చెన్నా ప్రణాళికను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, గ్రంథాలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు

మొదటి పేజీ తరువాయి

# పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం



గుర్తించాలని తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని కోరారు. వంశీక్రిష్ణ ఎమ్మెల్యే కావలసిన వ్యక్తి అని, వరుదు కళ్యాణికి కొన్ని ప్రత్యేక కారణాల వల్ల ఎంపి టికెట్ ఇవ్వలేక పోయామని, వారిద్దరినీ ఎమ్మెల్సీలుగా ప్రతిపాదించి ముఖ్యమంత్రి తగిన గుర్తింపు ఇచ్చారని అన్నారు. వీరి పదవులు పార్టీ కోసం పనిచేసేవారందరికీ స్ఫూర్తికావాలని అన్నారు. బిసి, ఎస్.సి. ఎస్.టి, మైనారిటీ వర్గాలకు ప్రధాన్యత కల్పిస్తున్న ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వమేనని, ఇతర రాష్ట్రాలనుండి ఆంధ్ర రాష్ట్రానికి వలసవచ్చిన మైనారిటీలకు సైతం ముఖ్యమంత్రి తగిన ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. ఇటీవల జివిఎంసికి జరిగిన 31 వార్డులో జైన మతానికి చెందిన వ్యక్తికి టికెట్టు ఇచ్చి కార్పోరేటర్ ని చేసిన ఘణత వైకాపాదేనని అన్నారు. బడుగు బలహీణ వర్గాల ప్రయోజనాలు కాపాడడం కేవలం జగన్మోహన్ రెడ్డి ద్వారా మాత్రమే సాధ్యమవతుందని అన్నారు. అగ్రవర్ణాలలలోని ఆర్దికంగా వెనుకబడిన వారికి ప్రత్యేకంగా స్కీంలు రూపొందించి వారి ప్రయోజకనాలనూ కాపాడేందుకు ముఖ్యమంత్రి చేస్తున్న కృషి ఎనలేనిదని అన్నారు. అనంతరం అక్కడి నుండి బీచ్ రోడ్డు మీదుగా ర్యాలీగా కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకొని నామినేషన్ దాఖలు చేసారు. కార్యక్రమంలో మంత్రి అవంతి శ్రీనివాస్, ఎంపిలు ఎంవివి సత్యన్నారాయణ, సత్యవతి, ఎమ్మెల్యేలు, వాసుపల్లి గణేష్ కుమార్, అదీప్ రాజు, ఎమ్మెల్సీ అభ్యర్థులు వంశీక్రిష్ణ శ్రీనివాస్, వరుదు కళ్యాణి, వివిధ కార్పోరేషన్ల చైర్మెన్లు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## ఏపీకి జాతీయ స్థాయిలో అవార్డుల పంట

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రోత్సాహంతో ఇది సాధ్యమైందన్నారు. నెల్లూరు కార్పొరేషన్‌కు సఫాయి మిత్ర చాలెంజ్‌లో మొదటి అవార్డు అందుకుంది. నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ దినేష్ అవార్డుని అందుకున్నారు. కాగా కేంద్రం ఈ అవార్డుల నేపథ్యంలో పది కోట్ల ప్రోత్సాహకం ప్రకటించింది. నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ దినేష్ మాట్లాడుతూ.. సఫాయి ఉద్యోగులకు సురక్షిత పరికరాలు అందజేసి శుభ్రత కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. అయిదు లక్షలోపు జనాభా ఉన్న మున్సిపాలిటీ విభాగంలో పుంగనూరుకు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు అందుకుంది. తిరుపతి కార్పొరేషన్ కు గార్బేజ్ ఫ్రీ సిటీ, సిటిజన్ ఫీడ్ బ్యాక్ , త్రీ స్టార్‌రేటింగ్, సఫాయి మిత్ర అవార్డులు వచ్చాయి. తిరుపతికి రెండు కోట్ల నగదు ప్రోత్సాహకం అందకుంది. విశాఖ, విజయవాడ కార్పొరేషన్‌కు గార్బేజ్ ఫ్రీ సిటీ అవార్డులు, నెల్లూరు కార్పొరేషన్‌కు సఫాయి మిత్ర చాలెంజ్ అవార్డు, కడప కార్పొరేషన్‌కు గార్బేజ్ ఫ్రీ సిటీ అవార్డులు వచ్చాయి. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అన్ని నగరాల్లో యంత్రాలతోనే డ్రైనేజీలను శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మనుషులతో డ్రైనైజీలు శుభ్ర చేయించడం జాతికే సిగ్గు చేటని, ప్రభుత్వాలతో పాటు ప్రజలు సైతం ఈ పద్దతులకు స్వస్తి పలకాలని తెలిపారు.

## 'చంద్రబాబు సతీమణి గురించి సభలో ఎక్కడా ప్రస్తావన రాలేదు'

వాడుకుంటారని దుయ్యబట్టారు.

'టీడీపీ సభ్యులే వ్యక్తిగతంగా విమర్శించడం ప్రారంభించారు. బాబాయ్ గొడ్డలి అంటూ టీడీపీ సభ్యులు నినాదాలు చేశాచారు. టీడీపీ కామెంట్లకు మావాళ్లు స్పందించారు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరి గురించి అసెంబ్లీలో ఎక్కడా చర్చలోకి రాలేదు. భువనేశ్వరి గురించి మాట్లాడినట్లు తప్పుడు చంద్రబాబు ప్రచారం మొదలు పెట్టారు. భువనేశ్వరిపై ఎవరైనా తప్పుగా మాట్లాడితే ఊరుకోం' అని మంత్రి కన్నబాబు స్పష్టం చేశారు.

## కరీమున్నిసా భౌతికకాయానికి నివాళులర్పించిన సీఎం జగన్



చెందారు. శాసనమండలి సమావేశానంతరం ఇంటికి వచ్చిన ఆమె రాత్రి 11.30 గంటల సమయంలో ఛాతిలో నొప్పి వస్తోందని చెప్పడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన విజయవాడలోని రెండు హాస్పటల్స్‌కు తరలించినా ఫలితం లేకపోయింది. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి కరీమున్నీసా పార్టీకోసం నిరంతరం శ్రమించారు. ఈ ఏడాది ఎమ్మెల్సీగా ఆమెకు సీఎం జగన్ అవకాశం కల్పించారు. శుక్రవారం ఉదయం శాసనమండలిలో ఆమె సీఎం జగన్, శాసనమండలి చైర్మన్ మోషేన్ రాజును కలిశారు. కరీమున్నీసాకు భర్త, ఐదుగురు కుమారులు ఉన్నారు.

# రైతాంగానికి మద్దతుగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించిన కె కె రాజు




తాటిచెట్ల పాలెం (విజయభాను న్యూస్) : అన్నదాతల ఆకాంక్షలు అనుగుణంగా సాగు చట్టాలు రద్దు కావడంపై గొప్ప విజయాన్ని సాధించిన రైతాంగానికి మద్ధతుగా విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త మరియు నెడ్క్యాప్ చైర్మన్ కేకే రాజు ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం జాతీయ రహదారి కూడలి నుండి మహారాణిపార్లర్ వరకు రోడ్డు వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి రైతులకు సంఘీభావంగా తెలియజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగు చట్టాల రద్దుకై రాష్ట్రంలో జరిగిన బంద్‌లతో సహా అన్ని కార్యక్రమాలకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇచ్చిందని అన్నారు. ఈ గొప్ప విజయాన్ని సాధించిన రైతాంగానికి మద్ధతుగా శనివారం ఈ ర్యాలీ నిర్వహించడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్,ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు,డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు,కార్పొరేటర్లు కె.అనిల్ కుమార్ రాజు,సాడి పద్మారెడ్డి,ఆళ్ళ లీలావతి&శ్రీనివాస్,కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు,వార్డు ఇంచార్జ్ లు నీలి రవి,పీలా వెంకటలక్ష్మీ,దుప్పలపూడి శ్రీనివాసరావు,మాజీ కార్పొరేటర్లు పోతు సత్యనారాయణ,బులుసు జగదీష్,అనుబంధ సంఘాల అధ్యక్షులు&సభ్యులు,రాష్ట్ర మరియు బి.సి కార్పొరేషన్ చైర్మన్&డైరెక్టర్లు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం జగన్ ఏరియల్ సర్వే

కడపలో ముంపునకు గురైన ప్రాంతాల్లో సీఎం ఏరియల్ సర్వే చేశారు.

భారీ వర్షాలతో పొంగి పొర్లుతున్న పాపాఘ్ని, పెన్నా నదుల కారణంగా ప్రభావితమైన ప్రాంతాల్లో సీఎం ఏరియల్‌సర్వే నిర్వహించారు. ఆ తర్వాత వెలిగల్లు, తెగిపోయిన అన్నమయ్య ప్రాజెక్టు ప్రాంతాన్ని సీఎం పరిశీలించారు. ముంపునకు గురైన గ్రామాల్లో ఏరియల్ సర్వే చేశారు. పింఛ ప్రాజెక్టుతో పాటు, చెయ్యేరు నది కారణంగా దెబ్బతిన్న ప్రాంతాలను, ముంపునకు గురైన ప్రాంతాల్లో సీఎం ఏరియల్ సర్వే చేశారు. తర్వాత రేణిగుంట, తిరుపతి టౌన్, పేరూరు ప్రాజెక్టు, స్వర్ణముఖీ నదీ ప్రాంతాల్లోను సీఎం ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. తర్వాత రేణిగుంట ఎయిర్‌పోర్టులో అధికారులతోనూ, ప్రజా ప్రతినిధులతోనూ ముఖ్యమంత్రి మాట్లాడారు. ఈ సందర్భంగా తిరుపతి టౌన్‌లో వెంటనే పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. వివిధ మున్సిపాల్టీల నుంచి ఇప్పటికే 500 మంది సిబ్బందిని రప్పించామని అధికారులు వివరించారు.

వీధుల్లో, డ్రైనేజీల్లో పేరుకుపోయిన పూడికను వెంటనే తొలగించాలని సీఎం ఆదేశాలు జారీచేశారు. తిరుపతిలో డ్రైనేజి వ్యవస్థపై మాస్టర్ ప్లాన్ రూపొందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వరద నీరు తగ్గగానే పంట నష్టంపై అంచనాలు వెంటనే రూపొందించి రైతులను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సహాయక శిబిరాలకు రాకున్నా.. ముంపునకు గురైన ఇళ్లకు వెంటనే ఆర్థిక సహాయం చేయాలని, వాళ్లు తిరిగి ఇంటికి వెళ్లే సందర్భంలో అధికారులు, యంత్రాంగం వారికి తోడుగా నిలవాలని సీఎం ఆదేశించారు.

# పుస్తక పఠనం ద్వారా జ్ఞానాభివృద్ధి

అచ్యుతాపురం, (విజయభాను న్యూస్) : పుస్తక పఠనం ద్వారా ప్రతి ఒక్కరూ జ్ఞానాన్ని విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని డెప్యూటీ తహశిల్దార్ లక్ష్మయ్య అన్నారు. శాఖా గ్రంథాలయంలో 54వ జాతీయ గ్రంథాలయోత్సవంలో భాగంగా గ్రంథాలయాధికారి కోటేశ్వర్రావు ఆధ్వర్యంలో మండలంలో ఉన్న అన్ని పాఠశాలల విధ్యార్థినీ విద్యార్థులచే వ్యాస రచన పోటీలు, స్వాతంత్ర సమరయోధులపై అవగాహన సదస్సు, డ్రాయింగ్, క్విజ్ కాంపిటీషన్ వంటి కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేసారు. ఎస్ఐ ఉపేంద్ర మాట్లాడుతూ పుస్తక పఠనం వలన నైపుణ్యాభివృద్ధి కలుగుతుందన్నారు. గ్రంథాలయంలో అన్ని పుస్తకాలతో పాటు అన్ని దినపత్రికలు రోజూ చదవడం వలన జనరల్ నాలెడ్జ్ పెంపొందుతుందన్నారు. ఎన్ఎఫ్ఎస్ఐ నాయకులు కూండ్రపు సోమునాయుడు మాట్లాడుతూ విద్యార్థులు ఆన్లైన్ ఆటలు మానేసి ఆన్లైన్ ఆట పోటీల్లో చురుకుగా ఉండాలన్నారు. తద్వారా విద్యనభ్యసింపజేసిన గురువులకు, తల్లిదండ్రులకు, దేశానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకువచ్చి ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు.. కార్యక్రమంలో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

I, I, KADALI SATYANARAYANAMMA (OLD NAME) W/o. DONGA MOHANA SRINIVAS R/o D.NO: 5-75/1, MOLAPODU, GUDIMELLANKA, MALIKIPURAM MANDAL, EAST GODAVARI,AP. CHANGE MY NAME FROM KADALI SATYANARAYANAMMA (OLD NAME) TO DONGA SATYA VANI (NEW NAME) hence forth I am being called as DONGA SATYAVANI for all purpose

# పర్యాటక రంగం అభివృద్ధికి పెద్దపీట

## ఐటిడిఎ లో టూరిజం సెల్ ప్రారంభించిన ఐటిడిఎ పిఓ



పాడేరు (విజయభాను న్యూస్): పర్యాటక రంగం అభివృద్ధికి పెద్ద పీట వేయాలని సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి రోణంకి గోపాల క్రిష్ణ అన్నారు. ఐటిడిఎ కార్యాలయంలో శనివారం టూరిజం సెల్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటకులకోసం ఏర్పాటు చేస్తున్న టెంట్లకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. ఐటిడిఎ లో ఎంప్లాయిమెంట్ సెల్ ఏర్పాటు చేయాలని ఐటీడీఏ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎపిఓ వి.ఎస్. ప్రభాకర్, టూరిజం మేనేజర్ సీనియర్ జి.దాసు, ఏ ఏ ఓ శ్రీనివాస కుమార్, కె. నాగేశ్వరరావు, ఐటిడిఎ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు గ్రంధాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



గాజువాక (విజయభాను న్యూస్) : ప్రజలు గ్రంథాలయలను సద్వినియోగం చేసుకోవాలని సెంట్ ఆన్స్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జానీస్ అన్నారు. మల్కాపురం ప్రకాష్ నగర్ లోని శాఖా గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తు -ప్రతి రోజు కనీసం ఒక పుస్తకం లోని ఒక పేజీ నైనా చదవడం అలవాటు చేసుకోవాలని, జ్ఞానాన్ని పెంచుకోవాలని, మార్పునప్రభావితం చెయ్యలని అన్నారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రముఖ న్యాయవాది జి.కె.వి.రాజు మాట్లాడుతూ...

- గత వారం రోజులగా విజయవంతంగా అనేక కార్యక్రమాలను నిర్వహండానికి సహకరించిన అందరికీ ధన్యవాదాలని, ప్రజలంతా కలసి గ్రంధా లయాలను కాపాడు కోవాలని అన్నారు. సమావేశంలో బి. సత్యానందం కె. సత్తిరాజు గ్రంథాలయాల ఆవశ్యకతపై ప్రసంగించారు. గత వారం రోజులుగా నిర్వహంచిన కార్యక్రమాలు నివేదికను గ్రంథాలయాధికారి వి.మోహన్ అందరికి తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ వారోత్సరాలను విజయవంతం చేసిన జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి. ఎస్.భాగ్య లక్ష్మిని, ఇతర అధికారులు అనసూయదేవి, అంజలి దేవి, సంధ్య, నడియాలను, సెంటెన్స్ గ్రంథాలయ అధికారి శిరీషను, ప్రిన్సిపల్ సిస్టర్ జానీస్ ను, జర్నలిస్ట్ కొయిలాడబాబును, స్థానిక యువకులు నూకరాజును ఉడతా రామారావును గ్రంథాలయ సభ్యులు ఘనంగా సత్కరించారు.



గ్రంధాలయం సభ్యులను, సీనియర్ సిటిజన్స్ ను భాగ్యలక్ష్మి సన్మానించారు.

అనంతరం వివిధ పోటీలలో విజేతలైన మల్కాపురం హైస్కూలు విద్యార్థులు, సెంటెన్స్ కళాశాల విద్యార్థినులకు పెద్దల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను, బహుమతులను అందించారు. గ్రంధాల యాధికారి వి.మోహన్ వందన సమర్పణ తో సమావేశం విజయవంతంగా ముగిసింది.



**గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మురళీనగర్‌లో వున్న బాలభాను విద్యాలయంలో ఎస్ఏ రైటింగ్ కాంపిటేషన్ మరియు డ్రాయింగ్ పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలో డిబేట్‌లో 1, 2, 3 విన్నర్స్, డ్రాయింగ్‌లో 1, 2 విన్నరులు లావణ్య, చాణుక్య, నీహారిక, అంతర్యామి, హర్షవర్ధన్ విద్యార్థులు విజేతలుగా ఎంపిక అయ్యారని బాలభాను వైస్ ప్రిన్సిపాల్ టి.మనోరమణి తెలిపారు.**



**శనివారం వంశీ కృష్ణ శ్రీనివాస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గా నామినేషన్ వేస్తున్న సందర్భంగా వి.విజయ్ సాయిరెడ్డి మరియు మంత్రి ముత్తం శెట్టి శ్రీనివాస్ రావులను సత్కరిస్తున్న రాష్ట్ర కార్యదర్శి యువజన విభాగం మరియు 29వ మాజీ పెసిడెంట్ మన్యాల శ్రీనివాస్ శనివారం 29వ వార్డు కలెక్టర్ ఆఫీస్ దగ్గర 29వ వార్డు కార్యకర్తలు మరియు 29వ వార్డు సుమారుగా 100మంది ప్రజానీకానితో స్వాగతం పలికి విజయ తిలకం దిద్ది బాణాసంచా మరియు గజమాలతో సత్కరించారు.**

## ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ పాఠశాలలో

# ఘనంగా ప్రపంచ బాలల దినోత్సవ వేడుకలు



భీమునిపట్నం (విజయభాను న్యూస్) : తగరపువలస దగ్గర మహారాజుపేటలో ఉన్న ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ పాఠశాల లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నార్డ్ ఆంగ్లియా విద్యాసంస్థకు చెందిన 30 కి పైగా దేశాల నుండి 60,000 కంటే ఎక్కువ మంది విద్యార్థులతో కలిసి విశాఖ ఓక్రిడ్జ్ పాఠశాల విద్యార్థులు బాలల హక్కుల గురించి అవగాహన కల్పించడానికి మరియు వారి సామర్థ్యాన్ని వెలికితీయడం కోసం వారికి సహాయ సహకారాలను అందించడానికి సన్నద్దుల య్యారనీ ప్రిన్సిపాల్ శైలా భమిడిపాటి తెలిపారు. ఈ ప్రపంచ బాలల దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలోని ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు తమ అమూల్యమైన అభిప్రాయాలను ఇతరుల ముందుకు తీసుకురావడానికి ఆసక్తితో ఉద్యుక్తులవుతున్నారని చెప్పారు. విద్యార్థులు రోగనిరోదకత, మానసిక ఆరోగ్యం, విద్య మరియు పర్యావరణ పరిరక్షణ. ప్రజల ఆరోగ్యం మరియు వారి శ్రేయస్సు ప్రాధాన్యంగా కరోనా మహమ్మారి నుండి ఎవరికివారు తగు సమయంలో టీకాలు వేయించుకునేలా అవగాహన కల్పించినట్లు చెప్పారు. విద్య మరియు ఇమ్యునైజేషన్ యొక్క బాలల హక్కులను పెంపొందించడం కోసం విద్యార్థులు తమ తమ నైపుణ్యంతో ఫుడ్ కోర్ట్, ఫన్ జోన్ లాంటి వివిధ స్టాల్స్ ఏర్పాటు చేసి నిధుల సేకరణ ఈవెంట్‌లను నిర్వహించారనీ అన్నారు. యూనిసెఫ్ ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 168 మిలియన్లకు పైగా పిల్లలు మరియు భారతదేశంలో 30% మంది విద్యార్థులు కోవిడ్-19 కారణంగా విద్యకు దూరమయ్యారనీ,ఓక్రిడ్జ్ విశాఖపట్నంలోని ఐబిడిపి విద్యార్థులు, మహమ్మారి సమయంలో పేద పిల్లలకు విద్యను కొనసాగించడంలో సహాయపడటానికి ప్రాజెక్ట్ వి4యు ని ప్రారంభించారనీ తెలిపారు. మనకు నివసించడానికి స్థలం లేకపోతే భవిష్యత్తు లేదు. పిల్లలు దీనిని గ్రహించి వాతావరణ మార్పుల గురించి మహాసముద్రాలను రక్షించడానికి విశాఖపట్నం బీచ్‌లలో చెత్తను శుభ్రం చేసి, పట్టణ వాసులకు, విద్యార్థులకు వారు ట్రాపికల్ సైక్లోన్స్ వంటి విపరీత వాతావరణ పరిస్థితులను అంచనా వేయడం మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో వాతావరణ శాస్త్ర ప్రొఫెసర్ డాక్టర్ కెర్రీ ఇమాన్యుయేల్ నుంచి నెర్చుకున్నట్లు తెలిపారు

ప్రతి ఒక్కరం మన పిల్లలకు బాలల హక్కుల గురించి తప్పకుండా తెలియపరచాలని, ప్రతి బిడ్డకు మంచి భవిష్యత్తు మంచి ఆరోగ్యం ఉండాలని ఓక్రిడ్జ్ విద్యార్థులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న వివిధ కార్యక్రమాలు విజయవంతంగా ముందుకెళ్ళాలని విద్యార్థులతో పాటు నేను సరైన మార్గ నిర్దేశకాలతో నిర్వహించగలమని విశ్వసిస్తున్నాను. మలాలా యూసఫ్‌జాయ్, పరమ్ జగ్గీ మరియు జాజ్ జెన్నింగ్స్ వంటి విజయవంతమైన యూత్ ఐకాన్స్ ను ఆదర్శంగా తీసుకొని అందరూ ఐక్యంగా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు పేరెంట్స్ తమ ఆనందాన్ని వెలిబుచ్చారు.

## 68వ జాతీయ కోపరేటివ్ వారోత్సవాల సందర్భంగా ఐఎన్‌సిఇ కోపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : 68వ జాతీయ కోపరేటివ్ వారోత్సవాల సందర్భంగా శనివారం ఐ ఎన్ సి ఇ కోపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో విశాఖపట్టణం రెడ్ క్రాస్ సొసైటీ లో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. నావెల్ డాక్ యార్డ్ సీనియర్ జనరల్ మేనేజర్ కమొడోర్ కె మురళిధర్ గారు ఈ రక్తదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రసంగిస్తూ, ఉఅన్ని దానాలలో కెల్లా రక్తదానం చాలా గొప్పదని రక్త దాతలను కొనియాడారు. కరోనా వ్యాధితో ప్రజలు అందరూ ఇబ్బంది పడుతున్న ఈ సమయంలో ఐ ఎన్ సి ఇ కోపరేటివ్ సొసైటీ ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మరొక విశిష్ట అతిథి సహకార శాఖ జాయింట్ రిజిష్టార్ మరియు జిల్లా సహకార శాఖాధికారి శ్రీ వీణ మిల్టన్ గారు ప్రసంగిస్తూ, ఉజాతీయ కోపరేటివ్ వారోత్సవాల సందర్భంగా సొసైటీ రక్తదాన కార్యక్రమం నిర్వహించడం చాలా గొప్ప విషయం అని చెప్పారు. ఃసహకారం ద్వారా సమాజ ప్రగతిః అనే జాతీయ వారోత్సవాల నినాదాన్ని ఐ ఎన్ సి ఇ కోపరేటివ్ సొసైటీ ఇప్పటికే ఆ దిశగా అమలు చేస్తూ అభివృద్ధి పథంలో సాగుతుందని అన్నారు. ఈ వారోత్సవాల సందర్భంగా రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించి సొసైటీ నౌకాదళం లోను, రాష్ట్రంలోను ఆదర్శవంతమైన సొసైటీ గా నిలుస్తుందని అభినందించారు. రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ వై శివ నాగేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ, ఈ కరోనా కష్టకాలంలో సొసైటీ వారు సుమారు 90 మందితో రక్తదాన కార్యక్రమం నిర్వహించి ఎంతోమంది ప్రాణాలు కాపాడడానికి సహకరించడం చాలా గొప్ప విషయం అని ధన్యవాదాలు తెలియజేశారు. ఐఎన్‌సిఇ కోపరేటివ్ సొసైటీ. ఫొటో లో ఉన్న వారు: రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిధులు నావెల్ డాక్ యార్డ్ సీనియర్ జనరల్ మేనేజర్ కమొడోర్ కె మురళీధర్ గారు, సహకార శాఖ జాయింట్ రిజిస్ట్రార్ మరియు యు.జి.సి కోపరేటివ్ అధికారి జిల్లా సహకార శాఖ అధికారి వీణ మిల్టన్ఇంకా ఇతర నాయకులు, సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు ఎన్ చిన్నారావు, వై శివాజీ గార్లు, ఎన్ సి ఇ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి వి రమణ, సొసైటీ కోశాధికారి ఎం రత్నాకర్ రావు ఉపాధ్యక్షులు కెవివిఎస్ డి కుమార్ గారు, డైరెక్టర్లు వి వెంకటేష్, ఎస్ కే అన్వర్ హుస్సేన్లు ఆర్ అయ్యప్పన్, బి.రామేశ్వర రావు, కె గోవింద రాజు, కె చిన అప్పారావులుసొసైటీ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# విద్యార్థుల స్కాలర్‌షిప్‌ను వెంటనే చెల్లించాలి

## కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్



అనకాపల్లి (విజయభాను న్యూస్) : రాష్ట్రంలో విద్యార్డులకు బకాయిలు పడిన స్కాలర్ షిప్‌ను ఫిజ్ రియాంబర్స్‌మెంట్ మెస్ బిల్లులను సంక్రాంతి లోపు చెల్లించాలని, కాంగ్రెస్ పార్టీకి చెందిన కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్ చేసారు. స్దానిక విజయరెసిడెన్సీలో శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సుమారు 80 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ ఓబీసీ మైనార్టీ విద్యార్డులకు స్కాలర్ షిప్‌లు పీజు రియాంబర్స్ మెంట్ మెస్ బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. వెంటనే చెల్లించి, ఆదుకోవాలని కోరారు. లేకుంటే విద్యార్డుల భవిష్యత్ అగమ్య గోచరంగా మారు తుందన్నారు. రాష్ట్ర ప్రబుత్వం విద్యార్డుల నిధులను తప్పుదారి పట్టించడం తగదన్నారు. హాస్టల్ల నిర్వాహణ మెరుగు పరచాలన్నారు. అలాగే రైతు వ్యతిరేక చట్టాల ఉద్యమంపై మాట్లాడారు. కేంద్రం దిగి వచ్చి, ఉద్యమానికి తలొగ్గి రైతు వ్యతిరేక చట్టా లను రద్దు చేయడం హర్షనీయ మనానరు. కాంగ్రెస్ కిషాన్ విజయంగా అబివర్నిం చారు. దేశ రాజకీయాలపై మాట్లా డుతూ విలువలు దిగజారు తున్నాయన్నారు. రాష్ట్రంలో ఆకలి బాదలు పెరిగి పోయాయన్నారు. బిజేపీ వలన దేశానికి తల వంపు వస్తుందన్నారు. సంపన్నవర్గాలకు దేశ సంపదను దోచిపెడుతున్నారని విమర్శించారు. చంద్రబాబుపై అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరమన్నారు. ఇటువంటి సంఘటనలు ఎప్పుడు జరగలేదన్నారు. అటువంటి సంఘటనలు పునావృతం కాకుండ చూడాలన్నారు. దేశానికి కాంగ్రెస్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తుట్టా కుమార్, మల్లపురెడ్డి కోటీశ్వరరావు, ఏడు కొండలుతదితరుతలు పాల్గొన్నారు.

# ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ టెర్మినల్ జలమయం



ములగాడ (విజయభాను న్యూస్) : : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు విశాఖలోని మల్కాపురం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ టెర్మినల్ వద్ద భారీగా వర్షపు నీరు చేరి వాహనాలు సగానికి పైగా మునిగాయి. లోతట్టు ప్రాంతాలు రోడ్ లు జలమయమయ్యాయి. వర్షం పడే ప్రతిసారి ఇదే పరిస్థితి నెలకొంటుందని లోతట్టు ప్రాంతం కావడం వల్ల టెర్మినల్ సమీపంమంతా వర్షం తో నిండి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని లారీ ట్యాంకర్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ పరిస్థితి పునరావృతం కాకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవా లని కోరుతున్నారు.

# విజయభాను సంపాదకీయం

## నిత్యజీవితంలో భాగమైన టెక్నాలజీ

ఇప్పటి తరానికి- అంటే 2000 సంవత్సరం తర్వాత పుట్టినవాళ్లకు (పోస్ట్ మిలీనియం జనరేషన్‌కు) టెక్నాలజీ ప్రధాన సాధనం, ఆసక్తి. ఈ టెక్నాలజీ ఆధారిత పరికరాలతో పనిచేస్తుంటారు. ఆధునిక సౌకర్యాలు పొందుతుంటారు. ఇలా నిత్యజీవితంలో భాగమైన టెక్నాలజీతోనే వాళ్ల అనుబంధం పెనవేసుకుంటున్నది. ఏ ఫుడ్ ఏ హోటల్‌లో బాగుంటుందో ఆన్‌లైన్ రివ్యూలు చూసి తెప్పించుకుంటారు. ఎలాంటి బట్టలు కావాలన్నా, సినిమాలు చూడాలనుకున్నా, ప్రయాణాలు చేయాలనుకున్నా, డాక్టర్‌ను కలువాలనుకున్నా ప్రతిదానికీ ఆన్‌లైన్ మార్గమే పరిష్కారం. ఎలక్ట్రానిక్ టెక్నాలజీపైనే విస్తృతంగా ఆధారపడే 'ఇ- జనరేషన్' ఇది. మొబైల్ ఫోన్ ద్వారా కంఫర్ట్ జోన్‌ను ఏర్పరుచుకున్న తరం ఇతరత్రా కోల్పోతున్నదేమిటో అర్థం చేసుకోలేకపోతున్నది. యువతరంలో కొందరు ఊహాలోకంలో విహరిస్తూ, సినిమాలు, రకరకాల మీడియాల ప్రభావాలకు లోనవుతూ ప్రేమ, పెండ్లి పేరిట జీవితాలను గందరగోళానికి గురిచేసుకుంటున్నారు. కాలేజీ చదువులప్పుడే తప్పనిసరిగా ప్రేమించాలి, లేకుంటే జీవితం వ్యర్థం అనుకుంటున్నారు. కొంతకాలానికే ప్రేమ విఫలమయిందంటూ ప్రాణాలు తీసుకుంటున్నారు. మరికొందరు ఎదుటివారిపై ప్రతీకార చర్యలకు దిగుతున్నారు. కొన్నిసార్లు తమ ప్రేమను తల్లిదండ్రులు అంగీకరించడంలేదని ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇలాంటి వార్తలు తరచూ మీడియాలో కనిపిస్తున్నాయి. తాజాగా.. పెద్దపల్లి జిల్లాలో ఓ యువకుడు తన ప్రియురాలు చనిపోయిందని ఆత్మహత్య చేసుకున్నాడు. హైదరాబాద్‌లో తన ప్రేమను నిరాకరించిందంటూ ఓ ఇంటర్ అమ్మాయిని యువకుడు పొడిచి చంపాడు. మహబూబ్‌నగర్ జిల్లాలో తల్లిదండ్రులు తమ పెండ్లికి అంగీకరించడం లేదంటూ యువతీయువకుల జంట ఆత్మహత్యకు పాల్పడింది. ఇలా అర్ధాంతరంగా బతుకులను ముగించేస్తున్న ఘటనలు సమాజానికి ఆందోళనకరమైన పరిణామం. ఆధునిక శాస్త్ర సాంకేతికాభివృద్ధితో అద్భుత ప్రగతి సాధిస్తున్నట్టు ఒకవైపు భావిస్తుంటే, మరోవైపు మానవ జీవితంలో ఇలాంటి అపసవ్యతలు ఎందుకు సంభవిస్తున్నాయనేది విశ్లేషించుకోవాల్సిన అంశం.

ఈ తరానికి స్వతంత్రంగా ఉండాలనే కోరిక ఎక్కువగా ఉంటుంది. డామినేట్ చేస్తుంది. తమ కంఫర్ట్ జోన్‌కు ఇబ్బందికరమనుకుంటే ఎలాంటివారినైనా, ఎలాంటి పరిస్థితులనైనా ఎదిరించాలనుకుంటారు. తల్లిదండ్రులతో ఎక్కువగా కలిసి ఉండాలనే ఆలోచన ఉండదు. అలాగే బంధుమిత్రులు.. వాళ్లతో అనుబంధాల విషయంలోనూ భిన్నంగానే ప్రవర్తిస్తుంటారు. ఇలా ఒకవైపు ఏకపక్షంగా జీవించే లక్షణాలుండేవారికి, మరోవైపు కొన్ని సమస్యాత్మక పరిస్థితుల్లో దృఢంగా, ఆత్మవిశ్వాసంతో నిలదొక్కుకునే ట్కస్థైర్యం లోపించడం విచిత్రకరంగా అనిపిస్తుంది. వీటికి కారణాలను అన్వేషిస్తే- పెరుగుతున్న పోటీ, అవాస్తవిక జీవిత లక్ష్యాలు, ఒంటరితనానికి లోనుకావడం వంటి అంశాలని భావించవచ్చు. జీవన నైపుణ్యాలను తగినంతగా అలవరుచుకోలేనప్పుడు సమస్యలు వారిని భయపెడతాయి. ఇతరుల నుంచి సరయిన సహాయ సహకారాలు పొందకుండా రకరకాల ఆలోచనలతో నిర్ణయాలకు వస్తుంటారు. ఇప్పటి ఆధునికత ఆత్మనిబ్బరాన్ని కలిగించలేక పోతున్నది. 'ఇ- జనరేషన్'కు ఇంగితం లోపిస్తున్నది. దానిని సరిదిద్దాల్సి ఉన్నది. టీనేజ్, యువతీయువకులకు విపరీత ఆలోచనలు రావడానికి కారణాలను అనేక రకాలుగా విశ్లేషించు కోవచ్చు. పరిణతి లేకపోవడం, ఎమోషనల్‌గా తొం దరపడటం అనిపించినప్పటికీ వాటికీ పరిష్కారాలను పరిశీలించాలి. ఇంటిలో తల్లిదండ్రులు, ఇతర కుటుంబసభ్యులు, విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు, స్నేహితులు, బయట ఇరుగుపొరుగు.. వీరందరితో అనుబంధాలు కూడా కీలక ప్రభావం చూపుతాయని గమనించాలి. అలా పెరిగేవారిలో తొందరపాటు ప్రమాదకర నిర్ణయాలు తీసుకోవడం తక్కువ. పలు సందర్భాల్లో సమస్యలకు పరిష్కార మార్గాలను పరిశీలించే స్వభావం అలవడుతుంది. తీవ్ర నిర్ణయాలకు వచ్చేవారి లక్షణాలను గమనిస్తే- వాళ్ల ప్రవర్తనలో విపరీత ధోరణులుంటాయి. మాట్లాడటం, నిద్రపోవడం, తినడంలో తేడాలను గమనించాలి. ఇవన్నీ అయితే ఎక్కువగా ఉంటాయి లేదా అసలు ఉండవు. మానసికంగా కుంగుబాటులో ఉంటారు. ఏడుస్తుంటారు. బిగుసుకుపోతారు. చూపుల్లో, చేతల్లో అశాంతి కనిపిస్తుంది. స్తబ్ధుగా లేదా దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లు కనిపిస్తారు.

# సాయిరెడ్డి ప్రజాదర్బార్ లో భారీగా వినతులు



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : వైసిపి ఉత్తరాంధ్ర వ్యవహారాల ఇంచార్జ్, రాజ్యసభ సభ్యులు వి విజయసాయిరెడ్డి శనివారం మధ్యాన్నం నుండి సీతమ్మధార లోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజల నుండి వినతులు స్వీకరించారు. పెన్షన్లు అందటం లేదని, ఉపాధి కల్పించాలని, భూకబ్జాలు అరికట్టాలని, నామినేటెడ్ పదవులను కేటాయించాలని, తదితర అంశాలు ప్రజాదర్బార్ లో విజయసాయిరెడ్డి దృష్టికి వచ్చాయి. వినతి పత్రాలను పరిశీలించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు.

- వృద్ధాప్య పింఛన్లు, ఒంటరి మహిళ పింఛన్లు అందడం లేదని పలువురు బాధితులు వినతి పత్రాలను అందజేశారు. వేపగుంట, కృష్ణరాయపురంలో అద్దె ఇంట్లో ఉంటున్న ఎం రామకృష్ణకి కరెంటు ఎక్కువ అని పెన్షన్ ఆపేశారని వాపోయారు. అలాగే 45 వార్డులోని సత్య సాయి నగర్ కు చెందిన వృద్ధులు కే బిన్నీ, పి సరోజినీ, ఎం అప్పల నరసయ్య, సేనాపతి కన్నయమ్మలకు వృద్ధాప్య పింఛన్లు, ఎస్ సత్యవతికి ఒంటరి మహిళ పింఛను ఆపి వేసినట్టు వినతి పత్రంలో పేర్కొన్నారు. అదే ప్రాంతానికి చెందిన జి గంగ, కే మహాలక్ష్మి లకు రేషన్ కార్డు లేదని, సచివాలయంలో దరఖాస్తు చేసిన రాలేదని వాపోయారు. శ్రీకాకుళం, డీసీఎంఎస్ చైర్మన్ చల్లా సుగుణమ్మ దేవరాజ్, సాయిరెడ్డిని కలిసి పాలకొండ, టెక్కలి, పాతపట్నం, పొందూరు, వీరఘట్టం తదితర ప్రాంతాల్లోని కోపరేటివ్ ( డీసీఎంఎస్) భూములు కబ్జాకు గురవుతున్నాయని, వాటిని కాపాడాలని వినతి పత్రంలో విజ్ఞప్తి చేశారు. - ఏయూలో టైం స్కేల్ కింద విధులు నిర్వహిస్తున్న తన భర్త కొవిడ్ తో చనిపోయారని, భర్త ఉద్యోగం ఇప్పించవలసిందిగా అతని భార్య పిఎస్ సవంతి వినతి పత్రం ద్వారా సాయిరెడ్డిని కోరారు. - ఎక్స్ సర్వీస్ మెన్ కు ఒక కార్యాలయం ఏర్పాటు చేయాలని తగరపువలసకు చెందిన 12 మంది మాజీ సైనిక్ ఉద్యోగులు వినతిపత్రం అందించారు. -జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని బ్యాక్లాగ్ పోస్టుల్లో తనకు సీనియార్టీ మీద వయసును దృష్టిలో పెట్టుకొని అవకాశం కల్పించాలని నిరుద్యోగి జామి శ్రీనివాసులు (43) వినతి పత్రం ద్వారా వేడుకున్నారు. - ఏయు ఉద్యోగి అయిన తన తండ్రి ఏ వి ప్రసాద్ చనిపోయారని, పుట్టుకతో వికలాంగుడైన తనకు పెన్షన్ నిబంధనల ప్రకారం ఇప్పించాలని ప్రసాద్ కుమారుడు రంగా విజ్ఞప్తి చేశారు. - అదేవిధంగా ఉమెన్స్ కాలేజ్ ఎదురుగా గల నైట్ ఫుడ్ కోర్ట్ తిరిగి ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని 32 దుకాణాల యజమానులు వినతిపత్రం అందించారు. - ఎంవిపి కాలనీ లో ప్రైవేట్ గా పనిచేస్తున్న సంతోష్, తన తండ్రి రైతు అని, 2016లో ఆత్మహత్య చేసుకున్నారని, ఇందుకు నష్టపరిహారం కేంద్ర ప్రభుత్వం 5 లక్షలు ప్రకటించిందని, అందులో రూ.1.5 లక్షలు ఇచ్చి, మిగిలిన డబ్బులు ఎమ్మార్వో, తన తల్లి కలిసి జాయింట్ అకౌంట్ వేశారని, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న తమకు ఆ డబ్బులు ఇప్పించవలసిందిగా కోరారు.

**- రింగు వల సమస్యను పరిష్కరించండి....**

ప్రజా దర్బార్ ముగించుకొని క్యాంపు కార్యాలయం నుండి బయటకు వచ్చిన విజయసాయిరెడ్డిని మత్స్యకారులు కలిసి రింగు వల సమస్య పరిష్కరించాలని కోరారు. ఇప్పటికే ఏడాది నుండి వేట లేక ఆకలితో పిల్లల చదువులకు ఫీజు కట్టలేక అల్లాడిపోతున్నమని వారు బోరున అన్నారు. రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాల్లో లేని ఆంక్షలు రింగ్ వలపై ఇక్కడ ఏంటని వారు ప్రశ్నించారు. సమస్యను పరిష్కరించడానికి కమిటీ వేశామని త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.



# చీడిగుమ్మలలో రక్తదాన శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు

గొలుగొండ (విజయభాను న్యూస్) : నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ జన్మదినం సందర్భంగా చీడిగుమ్మల గ్రామంలో గొలుగొండ జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. విశాఖకు చెందిన రెడ్ క్రాస్ సొసైటీ వారు దాతల నుంచి రక్తం సేకరించారు. ఈ రక్తదాన శిబిరంలో మండలానికి చెందిన పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులతో పాటు పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బందల రాజు, మండల ఉపాధ్యక్షుడు సుర్ల బాబ్జి పాల్గొన్నారు.

# 400 కేజిలు గంజాయి స్వాధీనం



కొయ్యూరు (విజయభాను న్యూస్) : కొయ్యూరు మండలం డౌనూరు ప్రాంతంలో తురబాడ గెడ్డ వద్ద రెండు కార్లలో 400 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని గొలుగొండ ఎన్‌ఫోర్సుమెంట్ సిఐ రాజారావు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిడబ్ల్యూ 3223 ఇన్నోవా కారు, కెఎల్ 13 3808 నెంబరు గల కారులో ఈ గంజాయి పట్టుబడిందన్నారు. కేరళకు చెందిన ఫాబిల్ సాయిధర్, కర్ణాటకకు చెందిన ఎండి.సబ్బార్, మేడూరుక చెందిన వంతల రాంబాబు, వంతల పరమేశ్వరరావు, నర్సీపట్నంకు చెందిన గెడ్డం రామ్‌నవీన్, షేక్ నాజీర్‌లను అరెస్టు చేయగా ఒకరు పరారీలో ఉన్నారన్నారు. వీరి వద్ద నుంచి రూ.1400 నగదు, ఒక బైక్, ఆరు సెల్‌ఫోన్లు స్వాదీనంచేసుకున్నామన్నారు. ఈ దాడిల్లో ఎస్సై గిరి, సిబ్బంది పాల్గొన్నారు.

# గుర్తు తెలియని వ్యక్తి మృతి



అన్నవరం (విజయభాను న్యూస్) : తూర్పు గోదావరి జిల్లా అన్నవరం గ్రామంలో రైల్వేస్టేషన్ రోడ్డు నందు వాటర్ సర్వీసింగ్ సెంటర్ వద్ద తెల్ల రంగు చొక్కా ముదురు రంగు ప్యాంటు ధరించిన గుర్తు తెలియని వ్యక్తి 18-11-2021న మృతి చెందాడు.అతను గురించి చుట్టు ప్రక్కల ఆరా తీయగా సమాచారం తెలియక పోవడంతో అన్నవరం అడిషనల్ ఎస్సై అజయ్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు నట్లు తెలియ జేశారు.ఆచూకీ తెలిసిన వారు ఈ నెంబరుకి 8121908580 సమాచారం తెలియజేయాలని కోరుతున్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే గణేష్ జన్మదిన వేడుకలు



నాతవరం(విజయభాను న్యూస్) : నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ పుట్టినరోజు సందర్భంగా నాతవరం పంచాయతీ ఆఫీస్‌లో వైసిపి నాయకులు కేక్ కట్ చేశారు. అనంతరం పిహెచ్‌సిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

# జాతీయ స్థాయిలో విశాఖ నగరానికి 9వ ర్యాంకు



స్వీకరణ అనంతరం మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ నగర మేయర్, జివిఎంసి కమిషనర్ మాట్లాడుతూ, ఈ అవార్డులు దక్కించుకున్న ఘనత విశాఖ నగర ప్రజల సహకారంతోనే జరిగిందని, వారికే ఈ అవార్డు అంకితం ఇస్తున్నామన్నారు. చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల కష్టానికి ప్రతిఫలం లభించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షన్ సర్వే పోటీల్లో జివిఎంసి ఎప్పుడూ కూడా శతశాతం నియమ నిబంధనలతో కూడిన పనులను పూర్తి చేయడం జరుగుతుందని, ప్రతి ఏటా నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షన్ లో ఇప్పటికే జివిఎంసికి పలు అవార్డులు లభించాయని వారు అన్నారు. పట్టణాల మధ్య పోటీతత్వం ఉంటేనే నగరాలు మరింత పరిశుభ్రంగా ఉంటాయని, అందులో జివిఎంసి విశాఖ నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు ఈ పోటీల్లో నిత్యం కృషి చేస్తుందని అన్నారు. జరగబోయే స్వచ్ఛ సర్వేక్షణ్ లో కూడా విశాఖ నగరం దేశంలోనే ప్రథమ స్థానం పొందేందుకు జివిఎంసి ప్రణాళికలు చేపడుతుందని వారు అన్నారు. రోజు రోజుకీ అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తున్న విశాఖ నగరం ప్రపంచ దేశాలకు దిక్సూచిగా సూచిస్తుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విశాఖ నగరాన్ని మరింత అభివృద్ధి చేయుటకు, సుందర నగరంగా తీర్చి దిద్దుటకు, నగర ప్రజలకు మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించుటకు ప్రణాళికలు చేపడుతుందన్నారు. ఈ అవార్డు ముఖ్యంగా ప్రజల సహకారంతో, పారిశుద్ధ్య కార్మికులు, అధికారులు, నివాసిత సంక్షేమ సంఘాలు, స్వచ్ఛ విశాఖ అంబాసిడర్లు, ఎన్జీవోలు, అందరి సమిష్టి కృషితో ఈ అవార్డ్ ని విశాఖ నగరం సొంతం చేసుకోవడం జరిగిందని, ఇందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానని మేయర్, కమిషనర్ తెలిపారు.

అనంతరం, జివిఎంసి ప్రధాన వైద్యాధికారి మరియు స్వచ్ఛ భారత్ మిషన్ నోడల్ అధికారి డాక్టర్ కెఎస్ఎల్ జి శాస్త్రి మాట్లాడుతూ జివిఎంసి యంత్రాంగంలో ముఖ్యంగా పారిశుద్ధ్య కార్మికులు, ఇంజినీరింగ్ అధికారులు, జోనల్ కమిషనర్లు, సహాయ వైద్యాధికార్లు, శానిటరీ సూపర్వైజర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ వార్డు కార్యదర్శులు మరియు ఇతర సిబ్బంది చిత్తశుద్ధితో నిర్వహించిన విధులకుగాను, ఈ అవార్డులను జివిఎంసి సొంతం చేసుకోగలిగిందని, ఇందుకు కృషి చేసిన వారందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు.



**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మరియు రాజ్యసభ సభ్యులు వేణుంబాక విజయసాయిరెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన వైసీపీ మహిళా నాయకురాలు పేడాడ రమణికుమారి**

# బొండం పంచాయితీలో గల పోలింగ్ బూత్ నందు ఓటర్ల నమోదు కార్యక్రమం





అరకులోయ (విజయభాను న్యూస్) : మండలంలోని బొండం పంచాయతీ బొండం గ్రామంలో అలాగే రేగ గ్రామంలో గల పోలింగ్ కేంద్రంలో శనివారం వీఆర్వో లక్ష్మి డిజిటల్ అసిస్టెంట్ కమల లు 18 సంవత్సరం నిండిన ప్రతి యువత ఓటు హక్కు వినియోగించుకోవాలని అవగాహన పరుస్తూ అర్హులైన వారి నుండి ఫారం 6 ను స్వీకరించుకున్నారు.

రెండు రోజులు జరిగే ఓటు హక్కు వినియోగించుకునే కార్యక్రమంలో ప్రతి ఒక్క అర్హులైన వారువినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు వాలంటీర్లు పాల్గొన్నారు.

# మహిళలను కించపరచడం తగదు



అనంతగిరి (విజయభాను న్యూస్) : అసెంబ్లీలో మంత్రులు ఎమ్మెల్యేలు, ప్రతిపక్ష నేత మాజీ ముఖ్య మంత్రి భార్యపై అనుచిత వాక్యలు చేయటంపై ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని అనంతగిరి తెలుగుదేశం పార్టీ నాయకులు శనివారం నాడు మండల కేంద్రము అంబేద్కర్ విగ్రహం వద్ద రోడ్డు మీద ధర్నా నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు మొస్య జోగులు మాట్లాడు తూ ముఖ్యమంత్రి హెూదాలో ఉండి దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని రాష్ట్ర ప్రజానీకం గమనిస్తున్నారని 2024 అసెంబ్లీ ఎన్నికల్లో జగన్ కు అడ్రస్ లేకుండా పోతుందని రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతుందని రాష్ట్రం మొత్తం ప్రజలు తెలుగుదేశం పార్టీ కోసం ఎదురుచూస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బుజ్జి బాబు, కొండబాబు మాజీ సర్పంచ్ దయానిధి, టోకురు మాజీ సర్పంచ్ దోన్ను, మండల ప్రధాన కార్యదర్శి ఆనంద్, మండల సీనియర్ పార్టీ నాయకులు, శంకర్రావు, రంజిత్,ఎగువ శోభ పంచాయతీ తెలుగుదేశం పార్టీ నాయకులు మట్టం శ్యామ్ తదితరులు పాల్గొన్నారు..

# వైభవంగా ఇండేసమ్మ అమ్మవారి పండగ



పరవాడ (విజయభాను న్యూస్) : పరవాడ మండలం రావాడ పంచాయతీ సోమి నాయుడుపాలెం గ్రామంలో కొలువై ఉన్న శ్రీశ్రీశ్రీ ఇండేసమ్మ అమ్మ వార పండ గను శనివారం ఉత్సవ కమిటి సభ్యుల ఆధ్వర్యంలో వైభ వంగా జరిపారు. పండగ సంద ర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని కానుకలు, మొక్కుబడులు తీర్చుకున్నారు. మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు వియ్యపు చిన్నా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు స్వీకరించారు.అమ్మవారి పండగ సందర్భంగా రాజన దేముడు, సిరపురపు తాతబాబు,నాయుడు, బండారు దేముడు, బండారు సన్ని బాబు, సన్యాసిరావు కుటుంబాల ఆర్థిక సహాయంతో ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధనా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు.భక్తులందరూ అమ్మవారిని దర్శించుకుని అన్నసమారాధలో పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో సిరపురపు అనిల్, సిరపురపు శ్రీను,రెడ్డి హరిబాబు , రెడ్డి సన్యాసినాయుడు, లక్ష్మి, చినతల్లి,సిరపురపు సన్నిబాబు, వార్డ్ మెంబర్ కూండ్రపు శ్రీనివాసరావు, కూండ్రపు అప్పల నాయుడు, సిరపురపు సన్నిబాబు, సిరపురపు రమణ, సిరపురపు నాయుడు, సిరపురపు కనకారావు, పైల సన్యాసిరావు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# వేతన పెంపుదల బకాయిలు తక్షణమే చెల్లించాలి



గాజువాక (విజయభాను న్యూస్) : కార్మికులకు తక్షణమే వేతన పెంపుదల బకాయిలు చెల్లిం చాలని గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి వైటి దాస్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ అంశంపై...

శనివారం డైరెక్టర్ పర్సనల్ ఇంచార్జీ మొహంతిను గుర్తింపు సంఘం ఆధ్వర్యంలో వారి కార్యాలయంలో కలిశారు. సమావేశం అనంతరం వినతి పత్రాన్ని అందజేశారు. ప్రభుత్వం నుంచి సహకారం లేదు ఫైనాన్సి యల్ కండీషన్స్ బాగాలేవంటూ సన్నాయి నొక్కులు నొక్కు తున్నారు. ఇప్పటికే సెయిల్ కార్మికులు వేతన బకాయిలు పొందారని ఇక్కడ కార్మికుల యొక్క మనోభావాలను అర్థం చేసుకుని వెంటనే ఏర్పాటు చేయాలని లేదంటే కార్మికులు యొక్క అసంతృప్తి ఉత్పత్తి మీద ప్రభావం పడుతుందని చెప్తూ బకాయిలు వెంటనే చెల్లించే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. వినతి పత్రం అందించిన వారిలో గుర్తింపు సిఐటియు యూని యన్ నాయకులు ప్రధాన కార్యదర్శి వైటి దాసు, సింహాచలం రామస్వామి యు. వెంకటేశ్వర్లు శ్రీనివాస్ రాజు గంగాధర్ అప్పారావు నీలకంఠం ఉన్నారు.

# దేశానికి వెన్నుముక రైతే రాజు

## పెందుర్తి నియోజకవర్గ వైసీపీ పార్టీ ఇన్‌ఛార్జి అజయ్‌రాజు



సబ్బవరం (విజయభాను న్యూస్) రైతు వ్యతిరేక చట్టాలను రద్దు కు మద్దతుగా పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజు ఆదేశాల మేరకు సబ్బవరం మండలంలో మూడు రోడ్ల కోడల లో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కోటాన రాము ఆధ్వర్యంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కొవ్వొత్తుల ర్యాలీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పెందుర్తి నియోజకవర్గం వైసీపీ పార్టీ ఇన్చార్జ్ అజయ్ రాజ్ పాల్గొని ఆయన మాట్లాడుతూ రైతు వ్యతిరేక చట్టాలు రద్దు దేశానికి మంచి శుభపరిణామం అని అన్నారు. అంతే కాకుండా దేశానికి రైతు వెన్నుముక లాంటి వాడని అన్నారు .దేశంలో పంటలు పండించే రైతు లేకపోతే ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు .ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుమ్మల అప్పారావు ,బోకం రామానాయుడు, సబ్బవరపు నారాయణ మూర్తి, బంతికోల పద్మ, శేఖర్ వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు

# జోసఫ్ ప్రకాష్ కు గౌరవ సన్మానం




జోసఫ్ ప్రకాష్ ను ఘనంగా సన్మానిస్తున్న డాక్టర్ టైటస్ తదితరులు

దేవరాపల్లి (విజయభాను న్యూస్) : న్యూ లైఫ్ కి థిలాజికల్ యూనివర్సిటీ ఈనెల 17న హైదరాబాద్ రవీంద్ర భారతి ఆడిటోరియంలో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. విశాఖపట్నం కేంద్రంగా చేసుకుని అనేకమైన గిరిజన పల్లె మారుమూల గ్రామాల్లో పట్టణ గ్రామాల్లో భారతదేశంతో పాటు ఇతర దేశాల్లో కూడా ఏసు క్రీస్తు యొక్క గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెబుతున్న గొప్ప దైవజనులు . అలాగనే భారత దేశము క్షేమం కొరకు భారతదేశ అభివృద్ధి కొరకు నిరంతరం శ్రమిస్తూ ప్రార్థన చేస్తూ అనేక మంది పేదలకు అనాధలకు దైవ జనులకు మరీ ముఖ్యంగా కరోనా సమయంలో అనేకమైన వలస కార్మికులకు అనేకమంది బాధిత కుటుంబాలకు ఆదుకున్న గొప్ప మనసున్న మనిషికి రెవరెండ్. ఎం జోసఫ్ ప్రకాష్ గారికి నజీర్ ఇంటర్నేషనల్ మినిస్ట్రీ యొక్క ఫౌండర్ డైరెక్టర్ కి న్యూ లైఫ్ యూనివర్సిటీ హైదరాబాద్ వారు "డాక్టర్ ఆఫ్ డివినిటీ అనే గౌరవ డాక్టరేట్ "ప్రధానం చేశారు. విశాఖపట్నం విచ్చేసిన సందర్భంగా వారికి ఘన సన్మానం జరిగింది. ఈ కార్యక్రమానికి నిస్సి మినిస్ట్రీస్ డైరెక్టర్ బిషప్.గొర్లె టైటస్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాస్టర్ ఆంటోనీ రాజుగారు ప్రత్యేకమైన ప్రార్థన చేశారు. పాస్టర్ సైమన్ ప్రత్యేకమైన గ్రీటింగ్స్ తెలియజేశారు అనేక మంది దైవజనులు పాస్టర్స్ పాల్గొన్నారు.

# వాకర్స్ క్లబ్ ఇంటర్ నేషనల్ ఆధ్వర్యంలో జిల్లా సదస్సు నిర్వహణ



విశాఖపట్నం, (విజయభాను న్యూస్) : వాకర్స్ ఇంటర్ నేషనల్ జిల్లా-101 ఆధ్వర్యంలో తేదీ 21, నవంబర్, 2021 న విశాఖపట్నం లో ఆళ్వార్ దాస్ కళాశాల ప్రాంగణము లో వాకర్స్ ఇంటర్ నేషనల్ వార్షిక సదస్సు ను నిర్వహిస్తున్నామని వాకర్స్ ఇంటర్ నేషనల్ ప్రెసిడెంట్ ఎలక్ట్ డాక్టర్ సుంకరి రవీంద్ర టైకూన్ హెూటల్ ప్రాంగణము లో జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో తెలియ జేశారు. విశాఖపట్నం లో ప్రారంభమైన ఈ వాకర్స్ క్లబ్ ఈ రోజు దేశమంతా వ్యాపించడమే కాకుండా అమెరికా, ఆస్ట్రేలియా దేశాలలో కూడా ప్రారంభిచడం కూడా జరిగిందని ఈ సందర్భంగా తెలియ జేశారు. వాకర్స్ క్లబ్బు సభ్యులు నడక తో పాటు ప్రతి నెల ఒక ప్రదేశం లో కలసి వివిధ అంశాలపై మేధావులచే ప్రసంగాలని ఏర్పాటు చేస్తారు. ప్రతీ ఒక్కరూ నామ మాత్రపు రుసుము తో వాకర్స్ క్లబ్ లో సభ్యత్వం తీసు కావచ్చని అన్నారు. నగరం లో పలు ప్రాంతాల్లో వాకర్స్ క్లబ్ లు ప్రారంభ మయ్యా యని అన్నారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షులు, వాకర్స్ డిస్ట్రిక్ట్ కాన్ఫరెన్స్ చైర్మన్ కమల్ బైయిద్ మాట్లాడుతూ ఆరోగ్య మే మహా భాగ్యం అనే నినాదం తో మేము పనిచేస్తూన్నా మని అన్నారు. కోవిడ్ -19 ప్రభలంగా ఉన్నపుడు 8 లక్షలు వెచ్చించి ఆక్సిజెన్ సిలిండర్ లు మరియు ఇతర పరికరాలను అందజేశామని అన్నారు. వాకర్ క్లబ్ ఆధ్వర్యంలో విశాఖ నగరం లో " హెల్త్ సెంటర్" ను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నామని కమల్ బైయిద్ తెలిపారు. వాకర్స్ ఇంటర్న్ నేషనల్ డిస్ట్రిక్ట్-101 గవర్నర్ శ్రీమతి ఏ. లక్ష్మి రెడ్డి మాట్లాడుతూ వేలాది మంది సభ్యులు గల మా వాకర్స్ క్లబ్ లు ఈ సంవ్సరమంతా పలు సామాజిక కార్యక్రమాలు చేపట్టారని అందులో భాగంగా ముఖ్యంగా మెడికల్ క్యాంప్స్ లు, పోషక పదార్థాలు పంపిణీ వంటివి చేపట్టారని ఆ క్లబ్బు లని గుర్తించి వారికి రేపు డిస్ట్రిక్ట్ కాన్ఫరెన్స్ లో అవార్డ్స్ ఇవ్వనున్నా మని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా వాకర్స్ ఇంటర్ నేషనల్ అధ్యక్షులు టి వి హనమంతరావు రావు తదితరులు పాలు గుంటారు. ఈ సమా వేశం లో వాకర్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ -101 కోశాధికారి ఉప్పలపాటి శుభ, చీఫ్ ఎడిటర్ కె. ద్వారకానాథ్,

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా వాకర్స్ ఇంటర్ నేషనల్ అధ్యక్షులు టి వి హనమంతరావు రావు గారు తది తరులు పాలు గుంటారు. ఈ సమా వేశం లో వాకర్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ -101 కోశాధికారి ఉప్పల పాటి శుభ, చీఫ్ ఎడిటర్ కె. ద్వారకాధ్, వాకర్ క్లబ్ విశాఖపట్నం కార్యదర్శి యం.వి.సోమశేఖర్, సంయుక్త కార్యదర్శి, డి వి వర్మ పాల్గొన్నారు.

# నేడు స్వర్ణకార సంఘం నూతన వర్కింగ్ ప్రెసిడెంట్ గా పక్కి కొండలరావు ప్రమాణ స్వీకారం

విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ఆంధ్రప్రదేశ్ స్వర్ణకార సంఘం నూతన వర్కింగ్ ప్రెసిడెంట్ గా స్వర్ణకార సమస్యలు పై అవగాహన, పోరాడేతత్వం ఉన్న పక్కి కొండలరావు (కొండబాబు) ను రాష్ట్ర స్వర్ణకార సంఘం నూతన వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉత్తరాంధ్ర నుండి ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విశాఖపట్నం కి చెందిన ఆయన ఉత్తరాంధ్ర స్థాయిలో, జిల్లా స్థాయిలోనూ పలు సేవా కార్యక్రమాలు, సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు చేసి ఉన్నారు. ఈ సందర్భంగా కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ.... ప్రస్తుత, మరియు గత స్వర్ణకార, విశ్వబ్రాహ్మణ రాష్ట్ర,జిల్లా సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు సహకారంతో.... సమాజంలో స్వర్ణకార, విశ్వబ్రాహ్మణ వర్గాలకు జరుగుతున్న అవమానాలు, చిన్న చూపులను తొలగించేందుకు పరిష్కారానికి తనవంతు ప్రయత్నం చేస్తానని భరోసా ఇచ్చారు. తాను ఈ పదవి కాలంలో స్వర్ణకార, విశ్వబ్రాహ్మణ ప్రజల అభిమానాన్ని పొందగలనని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ రోజు ప్రొద్దుటూరు లో రేపు (నవంబర్ 21 ) జరగనున్న ప్రమాణ స్వీకారం వేడుకలుకి ఆయన నగరానికి చెందిన పలువురు సభ్యులు తో కలిసి ప్రయాణం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రమాణస్వీకారం జరిగిన తదుపరి తాను రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, స్వర్ణకార పెద్దలు, నగర,జిల్లా నేతలు నుంచి సలహా, సంప్రదింపులు జరిపి కార్యాచరణ ప్రారం భించడానికి సమాయత్తం అవుతున్నానన్నారు.

## పారిశుద్ధ్యం కోసం మొదటి ఉపోద్ఘాతంని ప్రారంభించిన హార్పిక్ మిషన్ పానీ

విశాఖపట్నం (విజయభాను న్యూస్) : హార్పిక్ మిషన్ పానీ భారతదేశపు మొదటి 'శానిటేషన్ ఫర్ ఆల్ ప్లెడ్జ్ అండ్ ప్రియాంబుల్ : పరిశుభ్రమైన నీరు, సుస్థిరమైన పారిశుద్ధ్యం' ని ప్రపంచ మరుగుదొడ్డి దినోత్సవం నాడు మిషన్ పానీ శానిటేషన్ ఫోరమ్ లో గౌరవనీయ జల్ శక్తి మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్ మరియు అయిదుగురు ప్రముఖ మహిళా నేతలుతో ఆరంభిం చింది.ఈ కార్యక్రమంలో గౌరవనీయ ఉప రాష్ట్రపతి శ్రీ ఎం. వెంకయ్య నాయుడు మద్దతు ఇచ్చిన మొదటిరకం కాఫీ టేబుల్ పుస్తకం '101 స్టోరీస్ ఆఫ్ ఇన్ స్పిరేషన్ 'కూడా ఆవిష్క రించబడింది. గౌరవ్ జైన్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్, దక్షిణ ఆసియా, రెకిట్ ఇలా వ్యాఖ్యానించారు,"రెకిట్ పోరాటం ఏమంటే, అత్యధిక నాణ్యత గల పరిశుభ్రత , సంక్షేమం మరియు పోషణని పొందడం ఒక హక్కుగా చేయడం కానీ ఒక్ ఏర్పాటుగా కాదు. నేడు, ప్రపంచ మరుగుదొడ్డి దినోత్సవం సందర్భంగా, పేదరికాన్ని నిర్మూలించడానికి అవసరమైన నీటి సరఫరా మరియు పారిశుద్ధ్యం ఏర్పాటుని పొందేలా వీలు కల్పించడానికి ఒక ఆవరణ వ్యవస్థని సృష్టించడానికి మేము మా నిబద్ధతని బలోపేత్తం చేస్తున్నాం. దేశాభి వృద్ధి వ్యాఖ్యానంలో ఇది అత్యంత కీలకమైన మనుష్యుల హక్కుల అంశాల్లో ఒకటిగా తప్పనిసరిగా తలెత్తాలి" అని అన్నారు. ప్రముఖ గీత రచయిత్రి కౌసర్ మునీర్ రాసిన పారిశుద్ధ్య వాగ్ధానం అందరి కోసం పరిశుభ్రమైన నీరు మరియు పారిశుద్ధ్యం పొందడాన్ని నిర్ధారించడానికి అన్ని వర్గాలకు చెందిన ప్రజల్ని ఒక చోట చేర్చే లక్ష్యాన్ని కలిగి ఉంది. ఈ వాగ్ధానానికి జల్ జీవన్ మిషన్ మరియు స్వచ్ఛ్ భారత్ మిషన్ లు మద్దతు ఇచ్చాయి.

## బాలల దినోత్సవ ఉత్సవాలు

భీమునిపట్నం : అంతర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా ఎస్ ఓ ఎస్ కుటుంబ బలోపిత కార్యక్రమం లబ్ధి దారుల పిల్లలకు స్థానిక తోట వీధిలో బాలల దినోత్సవ ఉత్సవాలు నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జోనల్ కమిషనర్ వెంకట రమణ హాజరై పిల్లల అందరూ ప్రభుత్వ అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యావంతులు అయి క్రమ శిక్షణ తో ఎదగాలని మంచి పౌరులుగా దేశానికి సేవ చేయాలని కోరారు.

# ఎమ్ఎల్‌సిలు వంశీకృష్ణ, వరుదుకళ్యాణ్‌ల ను కలిసిన వైసీపీ శ్రేణులు

## ఎమ్మెల్సీలను సత్కరించిన పరవాడ ఎంపీపీ, జడ్పీటీసీ





పరవాడ (విజయభాను న్యూస్) : విశాఖపట్నం లో స్థానిక సంస్థల ఎమ్ఎల్‌సి పదవులకు నామినేషన్ వేస్తున్న సంద ర్భంగా ఎమ్ఎల్‌సి అభ్యర్థులు వరదు కల్యాణి, వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్‌ని శనివారం పరవాడ ఎంపిపి పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనువాస్,పరవాడ జడ్పిటీసి పియస్ రాజు పుష్పగుచ్చం అందజేసి మర్యాద పూర్వకంగా కలిసారు. అనంతరము దుశాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు, పరవాడ వైస్ ఎంపిపి బంధం నాగేశ్వరరావు, పెందుర్తి మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ పైల అప్పలనాయుడు, మాజీ అర్ ఇసియస్ చైర్మన్ చల్ల కనకరావు, బండారు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ వేయుచున్న వరుదు కల్యాణి నామినేషన్ పత్రంలో ప్రతిపాదకులుగా పరవాడ ఎం.పి.పి పైల వెంకట పద్మ లక్ష్మి, జెడిపిటీసీ పైల సన్యాసిరాజు,రాష్ట్ర సి.ఈ. సి సభ్యులు పైల శ్రీనివాసరావు, వైస్ ఎం.పి.పి బంధం నాగేశ్వరరావు లు సంతకాలు చేసి ప్రతిపాదించారు.

# విద్యార్థులకు కొట్టిన ఘటనపై విచారణ



అనంతగిరి (విజయభాను న్యూస్) : మండలంలో గల గుమ్మకోట గురుకుల పాఠశాలలో చదువుతున్న ఎనిమిది మంది విద్యార్థులకు స్టడీ క్లాస్ కు ఉండటం లేదని సోషల్ ఉపాధ్యాయుడు నాగభూషణం పిడి చిదంబరం విచక్షణ రహితంగా కొట్టారు ఈ సంఘటనపై అనంతగిరి మండల పరిషత్ అధ్యక్షురాలు నీలవేణి ఎంపీడీవో నగేష్ వివో వి ఆర్ డి మల్లేశ్వరరావు చైల్డ్ రైట్స్ మండల కన్వీనర్ గాలి నరసింహమూర్తి కో కన్వీనర్ రాజ్ కుమార్ పాఠశాలకు సందర్శించి ఈ సంఘ టనపై తల్లిదండ్రు లతో విద్యార్థులతో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. విద్యార్థులు స్టడీ తరగతికి రాకపోవడం వల్లే క్రమశిక్షణ లో భాగంగా కొట్టమని ఉపాధ్యాయులు తెలియ జేశారు. విద్యార్థులకు ఈ విధంగా కొట్టడం వల్ల బడికి దూరం అయ్యే ప్రమాదం ఉందని ఇప్పటికే ఆ విద్యార్థులు స్కూల్కి వెళ్లేందుకు భయపడుతున్నారని తల్లిదండ్రులు అధికారుల ముందు వాపోయారు విచారణ అనంతరం ఎంపీపీ నీలవేణి మాట్లాడుతూ పాఠశాలలో ప్రిన్సిపాల్ కు ఉపాధ్యాయులకు మధ్య చిన్న చిన్న తగాదాలు ఉండడం వల్లే ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయని ఆమె అన్నారు పాఠశాలలో పాఠశాలలో ప్రిన్సిపల్ సిబ్బంది మధ్య సమన్వాయం లోపం వల్లే ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకుంటూ మండల పరువు తీస్తున్నారని ఆమె అన్నారు గుమ్మకోట పాఠశాల ఎంతో ఆదర్శంగా ఉండేదని ఈ సిబ్బంది వల్లే పాఠశాల ప్రతి రోజు వార్తలు ఉందని ఆమె వాపోయారు ఇప్పటికైనా అధికారులు ఉపాధ్యాయులు సమన్వాయంతో పనిచేసే స్కూల్ పరువును కాపాడాలని హితవు పలికారు .ఈ కార్యక్రమంలో గుమ్మకోట సర్పంచ్ పాగి అప్పారావు భీంపోల్ హెచ్ఎం తదితరులు పాల్గొన్నారు.




# టీడీపీ ఆధ్వర్యంలో శాంతియుత ధర్నా




భీమునిపట్నం (విజయభాను న్యూస్) : మహిళలను గౌరవించడం చేతకాని ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది వైసిపి ప్రభుత్వమేనని టీడీపీ భీమిలి నియోజకవర్గ ఇంచార్జ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కోరాడ రాజబాబు విమర్శించారు.రాష్ట్ర శాసనసభ సమావేశాలు జరుగుతున్న సందర్భంలో శుక్రవారం చోటుచేసుకున్న పరిణామాలతో యావత్ మహిళా లోకం సిగ్గుతో తలదించుకుందని అన్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి దేవిపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంచార్జ్ కోరాడ రాజబాబు ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి పార్టీ కార్యాలయం నుండి గంటస్థంభం వరకు ర్యాలీగా బయలుదేరారు.అక్కడ

శాంతియుతంగా ధర్నా చేశారు. అనంతరం రాజబాబు మీడియాతో మాట్లాడుతూ మహిళలపట్ల ఇంత నీచంగా మాట్లాడేవారు మహిళా సాధికారత కోసం మాట్లాడటం దెయ్యాలు వేదాలు అల్లినట్లు ఉందని తెలిపారు. విద్యావంతురాలు, ఆంధ్రుల ఆరాధ్యదైవం నందమూరి తారకరామారావు కుమార్తె, 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఈ రాష్ట్రానికి విశిష్ట సేవలందించిన వ్యక్తి నారా చంద్రబాబునాయుడు సతీమణి అయిన భువనేశ్వరి దేవిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం యావత్ మహిళా లోకం సిగ్గుపడుతోందని అన్నారు. నోటికి వచ్చినట్లు మాట్లాడి ప్రజాప్రతినిధులు అన్న విషయాన్ని మరచిపోయి రౌడీలా మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రవర్తిస్తున్నారని దుయ్యబట్టారు. మహిళలు పట్ల నీచంగా మాట్లాడేవారు ఏమయ్యారో పురాణాలు చెబుతున్నాయని, అంతకంటే నీచంగా వీరికి తగిన శాస్తి జరుగుతుందని చెప్పారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, భీమిలి డివిజన్ అద్యక్షులు గంటా నూకరాజు మాట్లాడుతూ ప్రజలను పాలించేవారు ఎలాంటి వారు ఉండాలో ఇప్పటికైనా తెలుగువారు గుర్తించాలని అన్నారు. శాసనసభకు, శాసన మండలికి ఎంపికైన ప్రజాప్రతినిధులు ఎలాంటి స్వభావంతో ఉండకూడదో ఇప్పుడు ఉన్న మన రాష్ట్ర మంత్రులను చూసి తెలుసుకోవాలని అన్నారు. స్త్రీని దేవతలా భావించే ఈ దేశంలో, స్త్రీ శక్తికి ప్రతిరూపం అయిన ఈ రాష్ట్రంలో మాహిళలకు ఇంత అవమానం జరగడం ప్రభుత్వ వైఫల్యమని చెప్పారు. మహిళలను గౌరవించడం చేతకాని వారు మహిళా సాధికారత అని, మహిళా సంక్షేమ ప్రభుత్వమని, మహిళల కోసం దిశ చట్టం తెచ్చామని పెద్ద పెద్ద మాటలు ఆపాలని గంటా నూకరాజు హెచ్చరించారు. నందమూరి కుటుంబం అంటే ఈ రాష్ట్రానికే కాదు యావత్ దేశానికి గర్వకారణమని, అలాంటి ఇంటినుండి వచ్చిన ఆడబిడ్డపై ఇలాంటి అబండాలు వేయడం సరైనది కాదని అన్నారు. శాసన సభ సమావేశంలో ఎవరైతే ఇంత నీచంగా మాట్లాడారో ఆ మంత్రులు, ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాక్ష్యాత్ ముఖ్యమంత్రి, స్పీకర్ ఉండేటప్పుడే ఈవిధంగా జరగడం ప్రభుత్వ నిరంకుసత్వానికి నిదర్శనమని గంటా నూకరాజు అన్నారు. ఈ వ్యాఖ్యలకు కారణమయిన మంత్రులను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో 2,5,7 వార్డుల కార్పొరేటర్లు గాడు చిన్ని కుమారి లక్ష్మీ, పిల్లా మంగమ్మ, హేమలత, 1వ వార్డు అద్యక్షులు తమ్మిన సూరిబాబు, మాజీ కౌన్సిలర్ చిలక నర్సింగరావు, మాజీ జెడ్పీటీసీ శరగడ అప్లారావు, మహిళా నాయకులు గోడి అరుణ, కురిమిన లీలావతి, గొలగాని ఆనందబాబు, సంకురుభుక్త జోగారావు, అప్పికొండ నూకరాజు, కొక్కిరి అప్పన్న, మారోజు సంజీవకుమార్, కనకల అప్పలనాయుడు, వియ్యపు పోతురాజు, దితర నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సత్యదేవుని నిత్యాన్నదాన ప్రధకానికి రూ.1,01,116/- విరాళం



అన్నవరం : తూర్పుగోదావరి జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్య నారాయణ స్వామివారి దేవస్థానంలో ఎంతో ప్రతి ష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి తూర్పుగోదావరి జిల్లా తుని మండలం డి.పోలవరం గ్రామానికి చెందిన బీమిశెట్టి నాగేశ్వరరావు రూ.1,01,116/- విరాళమును దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.త్రినాధరావు కు అందజేసి ప్రతీ సంవత్సరం దీనిపై వచ్చు వడ్డీతో నవంబర్ 12వ తేదీన బీమిశెట్టి.స్వామి నాయుడు పేరున అన్నదానం జరిపించ వలసిందిగా కోరారు.ఈ సందర్భంగా దాతలను ఈవో త్రినాధరావు అభినందించారు.ఈ కార్య క్రమంలో పిఆర్వో కొండలరావు పాల్గొన్నారు.

# త్రాగు నీరు సమస్య పరిష్కరించాలి

## బి.కొత్తవలస గ్రామస్తులు







అనంతగిరి (విజయభాను న్యూస్) : భీంపోలు పంచాయతీ బి.కొత్తవలస అనే గ్రామానికి మంచినీటి సమస్య ఉంది చాలా రోజుల నుంచి గెడ్డ నీళ్లు త్రా గాల్సి వస్తుంది దానివలన అక్కడ ప్రజలు విష జ్వరాలు వస్తున్నాయి గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు మంచినీటి లేక బి. కొత్తవలస గ్రామం లో త్రాగునీరు సమస్య, పంచాయతీ అధికారులు తక్షణమే పరిష్కరించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# సీఎం జగన్మోహన్ రెడ్డి హయాంలో సువర్ణ పరిపాలన

**- నియోజకవర్గంలో 13 రోడ్లు నిర్మాణానికి నిధుల మంజూరు- ఇప్పటికే రూ.350 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు దాదాపు పూర్తి**

**- ప్రభుత్వ విప్, మాడుగుల ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు**



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ముత్యాలనాయుడు

దేవరాపల్లి, (విజయభాను న్యూస్) : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో రాష్ట్రంలో ప్రజలందరికి మంచి సువర్ణ పరిపాలన అందిస్తూన్నారని ప్రభుత్వ విప్, మాడుగుల ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు అన్నారు. శనివారం ఆయన వైసీపీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూ సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజలందరకి సరియైన సమయంలో కాలెండర్ ప్రకారం అందిస్తూ ఇంకా మరింతగా మౌలిక వసతులు, సదుపాయాలు, కల్పనా మెరుగుపరిచే విధంగా ఒక విజన్ రూపొందించుకొని ముందుకుపోతున్నారన్నారు. ఇప్పటికే మాడుగుల నియోజకవర్గం లో సుమారు 350 కోట్ల రూపాయలు తో వివిధ అభివృద్ధి పనులు చేపట్టి దాదాపు పూర్తి కావస్తున్నా తరుణంలో ఈ రోజు మరలా మాడుగుల నియోజకవర్గంనకు రోడ్లు మరియు భవనాలు శాఖ నుండి నియోజకవర్గం లో ఉన్న అన్ని రోడ్డులు నూతనంగా నిర్మాణం కోరకు రెన్యువల్ లో భాగంగా సుమారు 15,76,08,672( పదిహేను కోట్ల డబ్బై ఆరు లక్షల ఎనిమిది వేల రూపాయలతో)

13 రోడ్డులు నిర్మాణ పనులను పూర్తి చేయుటకు ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి మాడుగుల నియోజకవర్గం ప్రజలు తరుపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

రోడ్లు నిర్మాణానికి మంజూరైన నిధులు వివరాలు ఇలా ఉన్నాయి.

1) కాశీపురం నుండి సమ్మెద వరకు
రెండు కోట్ల ఇరవై లక్షల యాభై వేల రూపాయలు.

2) కే.కోటపాడు నుండి పింద్రంగి వరకు మూడు కోట్ల డబ్బై రెండు లక్షల ఏడు వేల రూపాయలు.

3) వెంకన్నపాలెం నుండి కే. కోటపాడు వయా ఆనందపురం వరకు డబ్బై ఎనిమిది లక్షల అయిదు వేల రూపాయలు.

4) భీమిలి, నర్శీపట్నం రోడ్డు నుండి కోనాం వరకు అరవై నాలుగు లక్షల డబ్బై ఏడు వేల రూపాయలు.

5) వరహాపురం నుండి విజయరామరాజుపేట వరకు ముప్పై ఎనిమిది లక్షల అరవై మూడు వేలరూపాయలు.

6) వడ్డాది నుండి కింతలి వరకు తొంబై నాలుగు లక్షల యాభై రెండువేలు రూపాయలు.

7) వేచలం నుండి వయా మామిడిపల్లి మారేపల్లి వరకు ఒక కోటి పన్నెండు లక్షల అరవై మూడు వేల రూపాయలు.

8) దేవరాపల్లి వయా తెనుగుపూడి తిమిరాం వరకు డబ్బై ఆరు లక్షల తొంబై అయిదు వేల రూపాయలు.

9) ఎం.అలమండ నుండి పెదనందిపల్లి వరకు నలభై తొమ్మిది లక్షల పద్దెనిమిది వేల రూపాయలు.

10) వడ్డాది నుండి కింతలి రోడ్డు వయా జాలంపల్లి వరకు నలభై ఒక లక్ష డబ్బై అయిదు వేల రూపాయలు.

11) ఎం.కోడూరు నుండి కండివరం వరకు ఒక కోటి పది లక్షల డబ్బై ఎనిమిది వేల రూపాయలు.

12) ఏ.కోడూరు నుండి డి. అగ్రహారం వరకు ఒక కోటి యాభై ఒక లక్ష రెండు వేల రూపాయలు.

13) వేచలం నుండి వయా అలమండ వారాడ వరకు ఒక కోటి అరవై అయిదు లక్షల ఇరవై ఆరు వేల రూపాయలు. ఇప్పటికే టెండర్ నోటిఫికేషను ఇవ్వడం జరిగినది

త్వరలోనే టెండర్లు ఖరారు చేసి 2022 జూన్ మాసంనకు పనులు పూర్తి చేస్తాం అని మాట్లాడుతూ ఇవే కాకుండా ఇంకా త్వరలోనే పంచాయతీ రాజ్ శాఖ లో ఉన్న రోడ్డులు కూడా పనులు చేపట్టుటకు నిధులు మంజూరు చేయడం కొరకు ప్రతిపాదనలు పంపిచడమైనది అని నిధులు మంజూరు చేసిన వెంటనే పనులు చేపట్టి పూర్తి చేస్తాం అని మాట్లాడుతూ...

ముఖ్యమంత్రి గారి సహాకారంతో నియోజకవర్గం మొత్తం మంచి అభివృద్ధినిపరచి రాష్ట్రస్థాయి లోనే ఉత్తమ నియోజకవర్గం గా తీర్చిదిద్దుటకు నేను ప్రజలు అందరి సహకారం తీసుకుంటూ అన్ని విధాలుగా కృషి చేస్తామన్నారు.

ఈ కార్యక్రమం లో మాడుగుల నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు కె.కోటపాడు జెడ్పీటీసీ ఈర్లే అనురాధ, దేవరాపల్లి జెడ్పీటీసీ కర్రి సత్యం ,కే.కోటపాడు ఎంపిపి రెడ్డి జగన్మోహన్ , దేవరాపల్లి మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు, దేవరాపల్లి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బూరె బాబురావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ స్థాయి క్రికెటర్లను అందిచడమే వై.ఎస్.ఆర్ కప్ లక్ష్యం

**- సుమారు 430 టీంలు పాల్గొంటున్న ఈ టోర్నీ ప్రపంచంలో అతి పెద్ద టోర్నీ కావాలి**

**- యువతలో క్రీడల పట్ల ఆసక్తి, క్రీడా స్ఫూర్తి, స్నేహ పూర్వక వాతావరణం నెలకొల్పేందుకు ఈ టోర్నీలు దోహదపడతాయి**

**- ఎంపీ (రాజ్యసభ) విజయసాయి రెడ్డి**





విశాఖపట్నం (విజయభాను న్యూస్) : విశాఖపట్నం నుండి ప్రపంచ స్థాయి క్రికెటర్లను దేశానికి అందించడమే వైఎస్ ఆర్ కప్ లక్ష్యమని రాజ్యసభ సభ్యులు, వైకాపా జాతీయ ప్రదాన కార్యదర్శి విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. శనివారం విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో వైఎస్ ఆర్ కప్ పోస్టర్ ను అవిష్కరించారు. అంతకు ముందు కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు, వార్డు కార్పోరేటర్లు, వివిధ కార్పోరేషన్ల చైర్మెన్లు, ఇతర నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ సుమారు 430 కి పైగా టీంలు పాల్గొంటున్న ఈ టోర్నీ ప్రపంచంలో అతి పెద్ద టోర్నీగా అభివర్ణించారు. యువతలో క్రీడల పట్ల ఆశక్తి పెంచేందుకు వారిలో క్రీడా స్ఫూర్తినింపేందుకు, స్నేహ పూర్వక వాతావరణం నెలకొల్పేందుకు ఈ టోర్నీ దోహదపడుతుందని అన్నారు. గల్లీ స్థాయిలోని క్రీడాకారుల యొక్కప్రతిభను వెలికితీసి వారికి రంజీ, ఐపిఎల్, అంతర్జాతీయ స్థాయి కి పంపించాలన్న ఉద్దేశ్యంతో ప్రతి సంవత్సరం ఈ వైఎస్ ఆర్ కప్ టోర్నమెంటు నిర్వహిస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా డిశంబర్ 21న టోర్నీ మెదటి మ్యాచ్ ప్రారంభమవుతుందని అన్నారు, జగన్మోహన్ రెడ్డి 341 రోజులు, 3648 కిలోమీటర్లు సుదీర్ఘ పాదయాత్ర చేసి విజయవంతంగా ముగించిన రోజు జనవరి 9 తేదీ పురష్కరించుకొని, అదే రోజున వైఎస్ ఆర్ కప్ గ్రాండ్ ఫినాలే నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ టోర్నీ నిర్వహించడం ద్వారా యువకుల లో ఫిట్ నెస్ పట్ల ఆశక్తి పెరుగుతుందని, ఆరోగ్యవంతమైన యువత తయారవుతుందని, పెద్ద టర్నీలో అడాలన్న ఎంతో మంది కల ఈ వైఎస్ ఆర్ కప్ ద్వారా నెరవేరుతుందని అన్నారు. గత సంవత్సరం నిర్వహించిన టోర్నీలో 423 టీంలు పాల్గొన్నాయని, ఇప్పుడు ఆ సంఖ్య 430 వరకు చేరుతుందని భావిస్తున్నట్లు తెలిపారు. మెత్తం 8 నియోజక వర్గాలను ఆరుపూల్ లు విభజించడం జరిగిందని, భీమిలి, అనకాపల్లి, పెందుర్తి నియోజక వర్గాలకు సబ్ అర్బన్ పూల్ గా నిర్ణయించడం జరిగిందని అన్నారు. 8 నియోజక వర్గాల పరిధిలోని 14 గ్రౌండులలో 19 రోజలు పాటు ఈ మ్యాచ్ లునిర్వహించడం జరుగుతుందని అన్నారు. ప్రతిష్టాత్మక వైఎస్ ఆర్ కప్- టోర్నీ నిర్వహణ బాద్యత అంధ్రాయూనిర్శిటీకి అప్పగించడం జరిగిందని యూనివర్శిటీ విసి ప్రసాద్ రెడ్డి ఆద్వర్యంలో సాంకేతిక బృందం గత సంవత్సరం ఈ టోర్నీని విజయవంతంగా నిర్వహించిందని గుర్తుచేసారు. నాక్ అవుట్ పద్ధతిలో 19 రోజులుపాటు జరుగనున్న ఈ టోర్నీ మెత్తం 440 మ్యాచ్ లు నిర్వహించడం జరగుతుందని అన్నారు. 50 మంది బిసిసిఐ అర్హత పొందిన అంపైర్ లు, 75 మంది నిష్ణాతులైన గ్రౌండ్ స్థాఫ్, 300 మంది వలంటీర్లు, 25 మంది అకడమిక్ ఫిజికల్ డైరెక్టర్లు, టెక్నికట్ ఎక్స్ పర్ట్ టీం, ఆర్గనైజింగ్ టీం పాల్గొంటారని అన్నారు. 7000 లకు పైగా పార్టిసిపేటింగ్ మెడల్స్, 38 విన్నింగ్ ట్రోఫీలు, 440 మేన్ ఆఫ్ ద మ్యాచ్ ట్రోఫీలు అందించడం జరుగుతుందని అన్నారు. విజేతలకు 40 లక్షల వరకు నగదు బహుమతులు అందజేయడం జరగుతుందని, 84 లక్షల విలువగల స్పోర్ట్స్ ద్రస్సులు అందించడం జరగుతుందని అన్నారు. పత్రి క్రీడాకారుడిని రూ1200 విలువ గల క్రికెట్ కిట్ ఉచితంగా అందిచడం జరుగుతుందని అన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తిగా ఉచితమని, తేదీ 30-11-2021 నాటికి 15 సంవత్సరాలు నిండి మరియు 40 సంవత్సరాలు లోపలవారై ఉండాలని అన్నారు. రాజకీయాలకు అతీతంగా టోర్నీ నిర్వహించడం జరగుతుందని కేవలం యువతలోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు క్రీడలపట్ల ఆశక్తి పెంచేందుకు ప్రతి సంవత్సరం నిర్వహిస్తామని అన్నారు. జివిఎంసి ఎన్నికలు దృష్టిలో పెట్టుకొని వైఎస్ ఆర్ కప్ నిర్వహించామని గతంలో ప్రత్యర్దులు రాజకీయం చేసారని, తప్పుడు ప్రచారాలు మానుకొని క్రీడాకారులను ప్రోత్సహించాలని కోరారు. ఏ వార్డులోని క్రీడాకారులు ఆ వార్డులకు సంబందించిన టీంలకే ప్రాతినిధ్యం వహించాలని కోరారు. పర్యాటక, క్రీడల శాఖా మంత్రి ముత్తం శెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ యువతలో స్ఫూర్తిని నింపేందుకే, ప్రపంచ స్థాయి క్రీడాకారులను దేశానికి అందించేందుకు రాజ్యసబ సభ్యులు విజయసాయి రెడ్డి ప్రతి సంవత్సరం వైఎస్ ఆర్ కప్ నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రపంచంలోనే ఇంత పెద్ద క్రికెట్ టోర్నమెంట్ ఎక్కడా నిర్వహించలేదని అన్నారు. ఆంధ్రాయూనివర్శిటీ వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఇంగ్లాండ్ కౌంటీ లో సైతం ఇంత పెద్ద టోర్నమెంట్ నిర్వహించలేదని అన్నారు. ఆంధ్రాయూనివర్శిటీ క్రీడా విభాగం పూర్తి సంకేతిక సహకారం అందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీలు ఎంవివి సత్యన్నారాయణ, సత్యవతి, విప్ ముత్యాలనాయుడు, ఎంఎల్ఏలు, వాసుపల్లి గణేష్ కుమార్, అదీప్ రాజ్, తిప్పలనాగిరెడ్డి, విఎంఆర్ డిలో చైర్ పర్సన్ అక్కరమాని విజయనిర్మల, నెడ్ క్యాప్ చైర్మెన్ కేకే రాజు, క్రిష్టియన్ మైనారిటీ కార్పోరేషన్ చైర్మెన్ జాన్ వెస్లీ, బ్రహ్మణ కార్పోరేషన్ చైర్మెన్ సీతం రాజు, మత్స్యకార కార్పోరేషన్ చైర్మెన్ కోలాగురువులు, తదితరులు పాల్గొన్నారు.




## రాహుల్ సౌరబ్ నిత్యాన్న సత్రానికి సిఎంఆర్ వంటసామగ్రి బహూకరణ

విశాఖపట్నం (విజయభాను న్యూస్) : శ్రీకాకుళం జిల్లాలో వావిలావలస గ్రామం, రేగిడి ఆమదాలవలస మండలంలో గల రాహుల్ సౌరబ్ నిత్యాన్నదాన ఆశ్రమంను సామాజిక కార్యకర్త పాలూరు సిద్ధార్ధ, ఆయన సతీమణి సుధారాణి (విని పించదు, మాటలు రావు) వీరిరువురు కలిసి గత 632 రోజులుగా వావిలావలస గ్రామంలో నిత్యాన్నదాన కార్యక్రమం చేపడుతున్నారు. అంతేకాకుండా సిద్ధార్ధ ముగ్గురు అనాథ పిల్లలని చదివిస్తున్నారు. వీరు నిర్వహించే సేవా కార్యక్రమాలు చూసి మా వూరి వెంకటరమణ వారిని మెచ్చుకుని ఆశ్రమంలో వంట చేయుటకు కావాల్సిన రూ.20,000/-లు విలువ గల వంట సామగ్రిని వారికి ఇప్పించి వారిని పాలూరి సిద్దార్ధ అభినందించారు.



## యువతకు శారీరక ధారుఢ్యం, మానసికోల్లాత్సాహానికి క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయి

**రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి**




విశాఖపట్నం (విజయభాను న్యూస్) : యువతకు శారీరక దారుఢ్యం, మానసికోల్లాత్సాహానికి క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయని రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి అన్నారు.శనివారం వైస్సార్ కప్ పోస్టర్ ను పార్టీ నాయకుల ఆనందోత్సాహాలమధ్య శనివారం పోస్టర్ ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న జీవీఎంసీ కార్పొరేటర్ కందులనాగరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా గత ఏడాదిలాగే ఈ సంవత్సరం కూడా జీవీఎంసీ 98 వార్డు లోని యువతకు క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు,డిసెంబర్ 21 న ప్రారంభమై జనవరి 9 తో ఈ పోటీలు ముగుస్తాయని తెలిపారు.ప్రతీ వార్డు నుంచి ఐదు టీం లు పాల్గొనేలా కార్యక్రమం రూపొందించినట్లు తెలిపారు.వార్డు కార్పొరేటర్ ల సారధ్యంలో టీం ల ఎంపిక జరుగుతుందని నాగరాజు తెలిపారు.విశాఖ యువత ఈ సదవకాశాన్ని ఉపయోగించు కోవాలని నాగరాజు కోరారు.ఈ కార్యక్రమంలో మంత్రి అవంతి శ్రీనివాసరావు,పార్లమెంట్ సభ్యుడు ఎంవీవీ సత్యనారాయణ,పలువురు శాసన సభ్యులు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ ఫ్యామిలిని అడ్డుపెట్టుకుని నీచ రాజకీయాల చేయడం చంద్రబాబు అలవాటు

**-గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి**

గాజువాక (విజయభాను న్యూస్) : చంద్రబాబు ముసలి కన్నీళ్లు,డ్రామాలు అన్నీ ఆంధ్రప్రదేశ్ ప్రజలు చూస్తున్నారని,ఎన్టీఆర్ ఫ్యామిలిని అడ్డుపెట్టుకుని నీచ రాజకీయాల చేయడం చంద్రబాబు అలవాటని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై మండిపడ్డారు. టి ఎన్ ఆర్ ఫంక్షన్ హాల్ లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ నిన్న జరిగిన అసెంబ్లీలో నీ ఫ్యామిలీ నీ భార్య పేరు పలకపోయిన నానా మాటలు అన్నారని మీడియా ముందు దిగజారి ఏడుస్తూ చంద్రబాబునాయుడు చేస్తున్న డ్రామాలు అన్ని గమనిస్తున్నారని ధ్వజ మెత్తారు. ఇటీవల రాష్ట్రంలో జరిగిన అన్ని ఎన్నికల్లో ఓటమి పాలవ్వడంతో ఏమి చెయ్యాలో దిక్కు తోచక మీడియా ముందు ముసలి కన్నీరు కారుస్తున్న చంద్రబాబు ను ఎవరు నమ్మరన్నారు. జగన్ చిన్నవాడన్నాడు, పరిపాలనా అనుభవం లేదన్నాడు. వై యస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబాన్ని ఎన్నో కష్టాలు పెట్టారు, జగన్మోహన్ రెడ్డిని ఆడిపోసుకున్నాడు..చంద్రబాబు అండ్ కో ఇప్పుడు ముసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. ఇప్పటికైనా డ్రామాలు ఆపి ప్రజాభిమానం సంపాదించు,లేదంటే వచ్చే ఎన్నికల్లో ఆ సీట్లు, ఓట్లు కూడా రావని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఏద్దేవ చేశారు.

ఈ కార్యక్రమంలోడి సి ఎం ఎస్ చైర్మన్ పల్లా చిన్న తల్లి, వైసీపీ కార్పొరేటర్ తిప్పల వంశీ రెడ్డి, రాజన రామారావు,వైసీపీ నాయకులు,మారుడుపూడి పరదేసి, దామ సుబ్బారావు, దొడ్డి రమణ, సిరట్ల వాసు,బొడ్డ గోవింద్,పూర్ణానంద శర్మ, సంపంగి ఈశ్వరరావు, ఈరోతి గణేష్, గొందేసి మహేశ్వర రెడ్డి, మంత్రి శంకర్ నారాయణ, వెంకట అప్పారావు,మంత్రి మంజుల, వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అన్నదాతల ఆకాంక్షలు ఫలించాయి

***-జై కిసాన్... జై జగన్... -ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి***

గాజువాక : దేశంలో రైతులు చేసిన ఉద్యమ పోరాటాలవలన అన్నదాతల ఆకాంక్షలు ఫలించి సాగు చట్టాలు రద్దు కావడం శుభపరిణామమని,ఫలితంగా రైతుల జీవితాల్లో కొత్త వెలుగులు ప్రసరిస్తాయనీ దేశంలో రైతే రాజు అన్నది మరోమారు నిరూపితమైందనీ గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పేర్కొన్నారు. సాగు చట్టాల రద్దుకై రాష్ట్రంలో జరిగిన బంద్‌లతో సహా అన్ని కార్యక్రమాలకు వైసీపీ పార్టీ మద్దతు ఇచ్చిన సంగతి తెలిసిందే. మహాత్మాగాంధీ స్ఫూర్తిని, శక్తిని ప్రతిబింబింపజేసేలా,భారత ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే ఓ గొప్ప విజయాన్ని సాధించిన రైతాంగానికి మద్ధతుగా శనివారం సాయంత్రం 6 గంటలకు పాత గాజువాక నుంచి కొత్త గాజువాక వరకు కొవ్వొత్తులతో రైతు సంఘీభావ ర్యాలీ జరిగింది.



# సీఎం జగన్‌ను కలిసిన త్రిదండి చినజీయర్ స్వామి

అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని త్రిదండి చినజీయర్ స్వామి మర్యాదపూర్వకంగా కలిశారు. రామానుజాచార్యులు అవతరించి వెయ్యేళ్లు అవుతున్న సందర్భంగా హైదరాబాద్ శివార్లలోని ముచ్చింతల్ ఆశ్రమంలో తలపెట్టిన సహస్రాబ్ది మహోత్సవాలకు రావాలని సీఎంను ఆహ్వానించారు. ఈ సందర్భంగా చినజీయర్ స్వామి వద్ద వైఎస్ జగన్ ఆశీస్సులు తీసుకున్నారు.

చినజీయర్ స్వామితో పాటు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మై హోం గ్రూప్ చైర్మన్ జూపల్లి రామేశ్వరరావు కూడా సీఎంను కలిశారు.


వచ్చే ఏడాది ఫిబ్రవరి 2 నుంచి 14 వ తేదీ వరకు సహస్రాబ్ది ఉత్సవాలు నిర్వహించనున్నారు.

ఇందులో భాగంగా 1035 కుండ శ్రీలక్ష్మీనారాయణ మహాక్రతువు, 108 దివ్యదేశ ప్రతిష్ఠ, కుంభాభిషేకము, స్వర్ణమయ శ్రీరామానుజ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరగనున్నాయి.

### రాజకీయ నాయకులకు ఆస్కార్ ఉంటే చంద్రబాబు

# హ్యాట్రిక్ పై హ్యాట్రిక్ కొట్టేవాడు

**- ఎంపీ (రాజ్యసభ) విజయసాయిరెడ్డి**



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : రాజకీయ నాయకులకు ఆస్కార్ అవార్డు ఉంటే ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు హ్యాట్రిక్స్ పై హ్యాట్రిక్స్ కొట్టేవాడని రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డి అన్నారు. ఎన్టీఆర్ సినిమాల్లో మాత్రమే నటించేవారని చంద్రంబాబు మాత్రం నిజ జీవితం, రాజకీయాల్లో కూడా నటనేనని,అది అమోఘం, అనితర సాధ్యం అని పేర్కొన్నారు. శనివారం ట్విట్టర్ వేదికగా పలు అంశాలపై ఆయన స్పందిచారు.అసెంబ్లీ సమావేశాలలో శుక్రవారం చేసిన శపథాలపై స్పందిస్తూ.. కార్యసాధకుల శపథాలు ఇలా ఉండవన్నారు. అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్ మోహన్ రెడ్డి అసెంబ్లీ గడువు ముగిసేంతవరకు తిరగిరానని చెప్పి, బయటకు వచ్చారని గుర్తు చేశారు. ఆయన సిఎంగానే అసెంబ్లీలోపలికి ప్రవేశించారని చెప్పారు. ప్రజల మధ్యే ఉంటూ తన పార్టీ భవిష్యత్తును నిర్మించారని కొనియాడారు. నిస్పృహతో చంద్రబాబులాంటి వారు చేసే శపథాల్లో నాటకీయత తప్ప నిబద్ధత కనిపించదని దుయ్య బట్టారు. అసెంబ్లీలో వైఎస్సార్ సీపీ సభ్యులెవరూ చంద్రబాబు కుటుంబ సభ్యుల గురించి ప్రస్తావించలేదని స్పష్టం చేశారు.కుప్పం మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి ఫ్రస్టేషన్‌లో ఉన్న చంద్రబాబు,అసెంబ్లీలో టీడీపీ సభ్యులే సీఎం జగన్ గారి తల్లి, చెల్లి, బాబాయి గురించి ప్రస్తావించారని చెప్పారు.తెలుగుదేశం పార్టీ రాజకీయ లబ్ధి కోసం ఇంతటి నీచానికి దిగజారడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర శాసన మండలి చైర్మన్‌గా ఎన్నికైన శ్రీ కొయ్యే మోషేన్ రాజు కి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. పెద్దల సభగా పిలుచుకునే మండలి చైర్మన్ పీఠంపై తొలిసారిగా దళిత వ్యక్తి ఆసీనులయ్యారని చెప్పారు. సామాన్య దళిత కుటుంబానికి చెందిన మోషేన్ రాజును మండలి చైర్మన్‌గా సీఎం జగన్ ఎంపిక చేశారని వెల్లడించారు. రాష్ట్ర శాసనమండలి సభ్యురాలు ఎండీ కరీమున్నిసా హఠాన్మరణం దిగ్భ్రాంతికి గురిచేసిందని చెప్పారు.

విశాఖపట్నం జిల్లా నర్సీపట్నం శాసన సభ్యుడు పెట్ల ఉమాశంకర్ గణేష్ హృదయ పూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియ జేశారు.

# వినూత్న ఆలోచనలతో వైద్య విద్యార్ధులకు అవకాశాలు

**- గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్**



సాగర్‌నగర్ (విజయభాను న్యూస్) : వైద్య విద్యను అభ్యసించే విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని తద్వారా పారిశ్రామిక వేత్తలుగా, ఆస్పత్రుల పరిపాలకులుగా, వైద్య సేవల నిర్వాహకులుగా మారడానికి విస్తృత అవకాశాలు ఎదురుగా నిలుస్తాయని గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ సూచించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్) వైద్య కళాశాల వైద్య విద్యార్థుల వార్షిక క్రీడా సాంస్కృతిక ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం తేది: 20-11-2021న జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హజరయ్యారు. ఎమ్.బి.బి.ఎస్ కోర్సు అనంతరం మెడికల్ పోస్టు గ్రాడ్యుయేషన్ ఒక్కటే కాక పలు అవకాశాల ఉన్నాయని ఆయన తెలిపారు. గీతంలో వివిధ కోర్సులు అభ్యసించే విద్యార్థులకు స్టార్టప్ ఆలోచనలను ప్రోత్సహించడానికి నార్త్-ఈస్ట్రన్ విశ్వవిద్యాలయంతో అవగాన ఒప్పందం కుదుర్చుకున్నామని ఆయన తెలిపారు. అలాగే హస్పటల్ అడ్మినిస్ట్రేషన్ వంటి కోర్సులు ప్రారంభించామని, కురసెర సంస్థ భాగస్వామ్యంతో ఆన్‌లైన్ కోర్సులను చదివే అవకాశం కల్పిస్తున్నామని వెల్లడించారు. గీతం వైద్య విద్యార్థులు సమాజానికి ఉపయోగపడే ఆరోగ్య సేవకులుగా మారాలని కోరారు. జిమ్‌సర్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతి పద్మజ మాట్లాడుతూ 2022 విద్యా సంవత్సరం నుంచి కొత్త పి.జి.కోర్సుల ప్రారంభానికి మెడికల్ కౌన్సిల్ అనుమతి లభించిందని తెలిపారు. గీతం పరిశోధకులు 15 కు పైగా ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చి (ఐసిఎమ్ఆర్) ప్రాజెక్టులు నిర్వహిస్తున్నారని తెలిపారు. వైద్య రంగంలో నూతన అంశాలపై గీతం పరిశోధకులు 50 పరిశోధన పత్రాలను వెలువరించారని పేర్కొన్నారు.

గీతం వైద్య విద్యార్థుల కోసం నైపుణ్య విభాగాన్ని ప్రత్యేకంగా నెలకొల్పుతున్నామని వెల్లడించారు. జిమ్‌సర్ ఆసుపత్రి మెడికల్ సూపరెంటెండెంట్ డాక్టర్ ద్వారకానాద్ మాట్లాడుతూ కోవిడ్-19 సమయంలో కరోనా బాధితలకు గీతం ఆసుపత్రి విశేష సేవలు అందించిందని అందులో వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థుల కృషి మరవలేనిదన్నారు.

గీతం ఆసుపత్రి ద్వారా టెలీమెడిసన్ సేవలు కొనసాగిస్తున్నామని అలాగే కోవిడ్ వేక్సిన్ కేంద్రాన్ని, పరీక్ష కేంద్రాన్ని నిర్వహిస్తున్నామని వెల్లడించారు. జిమ్‌సర్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వార్షిక క్రీడా, సాంస్కృతిక ఉత్సవాలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు, సంగీత కార్యక్రమాలు, ఫ్యాషన్ షో ఆకట్టుకున్నాయి. పోటీలలో విశేష ప్రతిభ కనబరిచిన గీతం వైద్య కళాశాల 2016 బ్యాచ్ విద్యార్థులకు రోలింగ్ ట్రోఫీని గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ అందజేశారు.



























## నటుడు కైకాల సత్యనారాయణ ఆరోగ్య పరిస్థితి మరింత విషమం

హైదరాబాద్: సీనియర్ నటుడు కైకాల సత్యనారాయణ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనకు అపోలో ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. తాజాగా కైకాల ఆరోగ్యానికి సంబంధించిన హెల్త్ బులిటెన్‌ను అపోలో వైద్యులు విడుదల చేశారు. 'సత్యనారాయణ ఆరోగ్య పరిస్థితి మరింత విషమంగా ఉంది. మల్టీ ఆర్గాన్స్ ఫెయిల్ అయ్యాయి. చికిత్సకు ఆశించినంత మేర ఆయన స్పందించటం లేదు' అని వైద్యులు పేర్కొన్నారు.

# ఘనంగా ఎంజె పురం సిద్ధి వినాయక నిమజ్జనోత్సవం

అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : భాద్రపద మాసం లో వినాయక ప్రతిష్ట చేసి మరల కార్తీక మాసంలో నిమజ్జనం చేయడం ఎం.జగన్నాథపురంలో ఆనవాయితీగా వస్తుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ సాంప్రదాయ బద్ధంగా వారి పూర్వీకుల నుండి వస్తుందని, నిమజ్జన మహోత్సవంలో జగన్నాథపురం గ్రామానికి జిల్లా నలుమూలల నుండి భక్తులు తండోపతండాలుగా తరలి వస్తారని కమిటీ సభ్యులు తెలిపారు. వినాయకుని దిష్టి పోయేందుకు ఆనంతసేన అనే నేల వేషం వేసి ఊరంతా సెవాన్ని తిప్పె కార్యక్రమం నిర్వహిస్తారు. అలాగే స్టేజ్ వేషాలు, బల్లవేశాలు, నెలవేశాలతో స్వామికి ఘనంగా నిమజ్జనం జరుపుతారు. వినాయక నిమజ్జనం ఉత్సవానికి గ్రామంలో యువకులంతా కలిసికట్టుగా రాజకీయాలకు అతీతంగా ఉత్సవం జరుపుతున్నట్లు సభ్యులు తెలిపారు. ఈ సంబరం ఉత్సవ కమిటీ అలాగే గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com